ప్రజాశక్తి

శనివారం 28 డిసెంబర్ 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ఊరూ వాడా సిపిఎం ఉద్యమాలు

- చెత్త పన్ను వ్యతిరేక పోరాటంలో విజయం
- 66 వేల మంది ఇళ్ల పట్టాల సాధన దిశగా కార్యాచరణ
- రుషికొండ, ఎర్రమట్టి దిబ్బల విధ్వంసంపై పోరాటం
- విద్యుత్ భారాలు, ప్రజా వ్యతిరేక విధానాలపై నిరసనలు
- నేడు, రేపు పెందుర్తిలో పార్టీ విశాఖ జిల్లా 24వ మహా సభ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

గడిచిన మూడేళ్లలో సిపిఎం విశాఖ జిల్లాలో ఎన్నో పోరాటాలు నిర్వహించింది. పలు విజయాలను సాధించింది. నిరంతర ఆందోళనలతో సిపిఎం ప్రతిష్ట ఈ పారిశ్రామిక నగరిలో మరింత పెరిగింది. ఉక్కు పరిరక్షణ పోరాటం, పన్నుల భారాలపై నడిపిన ఉద్యమాలు ఎర్రజెండాకు మంచి పేరు తెచ్చిపెట్టాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాడిన సిపిఎం గత కార్యక్రమాలను సమీక్షించుకుని, తగు ఉద్యమ కర్తవ్యాలను నిర్దేశించుకునేందుకు సిద్ధమైంది. శని, ఆదివారాల్లో పెందుర్తిలో జరుగనున్న పార్టీ 24వ జిల్లా మహాసభ దీనికి వేదిక కానుంది. ఈ నేపథ్యంలో పార్టీ గడిచిన కాలంలో చేపట్టిన పోరాటాలను, సాధించిన విజయాలను గుర్తుచేస్తూ సాగేదే ఈ కథనం.

సిపిఎం ఆధ్వర్యాన సాగుతున్న పర్యావరణ పరిరక్షణ ర్యాలీ (ఫైల్ ఫొటో)

చెత్త పన్నుపై పోరాట విజయం

కేంద్ర బిజెపి ప్రభుత్వం పట్టణ సంస్కరణల్లో భాగంగా తెచ్చిన చెత్త పన్ను విధానాన్ని రాష్ట్రంలోని గత జగన్ ప్రభుత్వం అమలు చేసేందుకు పూనుకుంది. చెత్తమీద పన్ను వేయడంతో విశాఖ వాసులపై ఆ భారం పడింది. అందరూ ఇబ్బందిపడ్డారు. చెత్త పన్ను చెల్లించకపోతే ప్రజల 'సంక్షేమం' ఆపేస్తామన్న ప్రభుత్వ బెదిరింపులకు వ్యతిరేకంగా సిపిఎం ఎక్కడికక్కడ విశాఖలో ఆందోళనలు నిర్వహించింది. జివిఎంసి కౌన్సిల్ సమావేశాల్లో ఆ పార్టీ 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు పలుమార్లు ఈ అంశాన్ని లేవనెత్తి అజెండా చేశారు. మున్సిపల్ సిబ్బందికి లక్ష్యాలు విధించి పన్ను వసూలు చేయకపోతే జీతాలు మిగతా 2లో..

మహాసభకు సర్వం సిద్ధం

- పెందుర్తి ఎరుపుమయం
- నేడు మహా ప్రదర్శన, బహిరంగ సభ
- పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తదితరులు హాజరు

శని, ఆదివారాల్లో పెందుర్తిలో జరిగే సిపిఎం విశాఖ జిల్లా 24వ మహాసభకు అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. గోపాలపట్నం నుంచి పెందుర్తి వరకూ వెళ్లే రోడ్డు ఎర్రజెండాలతో ముస్తాబైంది. ఎర్ర తోరణాలతో కూడళ్లు కళకళలాడుతున్నాయి. స్వాగత ద్వారాలు ఆకట్టుకుంటున్నాయి. తొలి రోజు 28న పెందుర్తి జూనియర్ కాలేజీ నుంచి మహా ప్రదర్శన ప్రారంభమై సుజాతనగర్ వరకూ కొనసాగుతుంది. 11 గంటలకు సుజాత నగర్‌లో బహిరంగ సభ నిర్వహించనున్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, సీనియర్ నాయకులు సిహెచ్.నర్సింగరావు, ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ తదితరులు హాజరుకానున్నారు. సభలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడనున్నారు. మహాసభను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు పిలుపునిచ్చారు.

స్వాగత ద్వారం వద్ద నాయకులు

ఉక్కుపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరి స్పష్టం చేయాలి

వార్త 6లో..

విద్యుత్ భారాలపై వైసిపి నిరసనలు

వార్త 7లో..

జివిఎంసి స్థాయీ సంఘంలో..

అభివృద్ధి పనులకు ఆమోదం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి పరిధిలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు స్థాయీ సంఘం ఆమోదం తెలిపింది. శుక్రవారం జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని స్థాయీ సంఘం సమావేశ మందిరంలో స్థాయీ సంఘం చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన సమావేశం జరిగింది. అనంతరం మీడియాతో ఆమె మాట్లాడుతూ స్థాయీ సంఘం సమావేశంలో 45 అంశాలను పొందుపరిచి చర్చించామని, వాటిలో 15, 16, 39 అంశాలను వాయిదా వేశామని చెప్పారు. మిగిలిన 42 అంశాలు ఆమోదం పొందాయన్నారు.

ఇంజినీరింగ్ విభాగం, ప్రజారోగ్య విభాగం అభివృద్ధి పనుల అంశాలకు సంబంధించి ఆమోదం లభించినట్టు పేర్కొన్నారు. సమావేశంలో ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ సి.వాసుదేవరెడ్డి, అసిస్టెంట్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ ఆదినారాయణ, ఎఒ మంజుల, బయాలజిస్ట్ సాంబమూర్తి, కార్యనిర్వాహక ఇంజినీర్లు అప్పారావు, శ్రీధర్, పివి.గంగాధరరావు, ఎస్.చిరంజీవి, తారా ప్రసన్న పాల్గొన్నారు.

వెబినార్‌లో పాల్గొన్న మేధావులు

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి చర్యలు చేపట్టాలి

ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక వెబినార్‌లో మేధావుల డిమాండ్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర సమతుల్య, సమగ్రాభివృద్ధి చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని పలువురు మేధావులు డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజ శర్మ అధ్యక్షతన జరిగిన వెబినార్‌లో వారు మాట్లాడారు. ఈ వెబినార్ ఓ డిక్లరేషన్‌ను ఆమోదించింది. రాష్ట్ర ప్రభుత్వానికి పంపాలని నిర్ణయించింది. వెబినార్‌లో కేంద్ర ప్రభుత్వ మాజీ కార్యదర్శి, రిటైర్డ్ ఐఎఎస్ ఇఎఎస్.శర్మ, ప్రొఫెసర్ కెఎస్.చలం, పర్యావరణవేత్త డాక్టర్ వై.కృష్ణమూర్తి, ప్రముఖ కవి గంటేడ గౌరు నాయుడు, ఎం.శ్రీనివాసా, బద్రి కుర్మారావు, ఉప్పల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర విభజన తరువాత కూడా ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలు, ప్రకాశం జిల్లా అభివృద్ధి చెందలేదు సరికదా మరింత వెనుకబాటులోకి నెట్టబడ్డాయని వక్తలు అభిప్రాయపడ్డారు. రాష్ట్ర విభజన చట్టంలోని సెక్షన్ 46 (3) ప్రకారం వెనుకబడ్డ ప్రాంతాల ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీని కేంద్రం మిగతా 2లో..

ది హిందూస్థాన్ పెట్రోలియం కార్పోరేషన్ కాంట్రాక్టర్ లేబర్ కో-ఆపరేటివ్ సొసైటీ లి.బి.-1997 మల్కాపురం, విశాఖపట్నం

అత్యవసర సర్వసభ్య సమావేశం (స్పెషల్ జనరల్ బాడీ)

ఇందు మూలముగా యావన్మంది సంఘ సభ్యులకు తెలియజేయునది ఏమనగా ఈ సంఘము యొక్క అత్యవసర సర్వసభ్య సమావేశం (స్పెషల్ జనరల్‌బాడీ) తేది : 18-01-2025 శనివారం సాయంత్రం సా॥ 5 గంటలకు శ్రీహరిపురం, పిలకవానిపాలెం, ఎస్.బి.ఐ. కోరమండల్ బ్రాంచి వద్ద ఉన్న వైష్ణవి ఫంక్షన్ హాలులో జరుపబడునని తెలియజేయడమైనది.

అజెండా / చర్చనీయాంశములు

1. అగ్రిమెంటుపై చర్చ : హెచ్.పి.సి.ఎల్. యాజమాన్యంతో ప్రస్తుతం జరిగిన అగ్రిమెంటు చర్చా విషయము కార్మికులతో చర్చించుట గురించి
2. ఆంధ్రప్రదేశ్ సహకార సంఘముల చట్టములోని సెక్షన్ 31-ఎ4 ప్రకారం శ్రీ విశాఖపట్నం సహకార సంఘమున డిప్యూటీ రిజిస్ట్రార్ వారు జారీ చేసిన డైరెక్షన్‌పై చర్చించి తగు చర్యలు తీసుకొనుట గురించి
3. అధ్యక్షుల అనుమతితో ఇతర విషయములు

ఇట్లు

పాలక వర్గ సభ్యులు

హిందుస్థాన్ పెట్రోలియం కార్పోరేషన్ కాంట్రాక్టర్ లేబరు కో-ఆపరేటివ్ సొసైటీ లి.బి.-1997, మల్కాపురం, విశాఖపట్నం.

మొదటి పేజీ తరువాయి..

ఊరూ వాడా సిపిఎం ఉద్యమాలు

ఆపేస్తామనడం, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లను ప్రజలమీదకు ఉసిగొల్పడం వంటి చర్యలకు వ్యతిరేకంగా ఎర్రజెండా పోరాడింది. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పన్నును రద్దు చేసింది. విలువ ఆధారిత ఆస్తిపన్నుపై నేటికీ సిపిఎం ఉద్యమాలు కొనసాగిస్తోంది.

పర్యావరణ రక్షణకు ఎర్రజెండా

రుషికొండ, ఎర్రమట్టి దిబ్బల విధ్వంసంపైనా, పర్యావరణాన్ని నాశనం చేసే గత ప్రభుత్వ విధానంపైనా సిపిఎం పోరాటాలు నిర్వహించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పలు కొండలను విధ్వంసం చేసే పనిని కొనసాగిస్తోంది. కుసులువాడ కొండపై మైనింగ్‌కు అనుమతులిచ్చేశారు. ప్రజలు వ్యతిరేకిస్తున్నా పాలకులకు పట్టడం లేదు. ఈ క్రమంలో వైసిపికి, టిడిపి కూటమికి తేడాలేదన్న విషయాన్ని సిపిఎం ప్రజల ముందు వుంచడంలో విజయవంతమైంది. భూమిలేని పేదలకు టిడిపి హయాంలో టిడ్కో ఇళ్లు, వైసిపి హయాంలో జగనన్న ఇళ్లను నిర్మాణం చేయడంలో రెండు ప్రభుత్వాలూ విఫలమయ్యాయి. లబ్ధిదారుల నుంచి రూ.25 వేల నుంచి రూ.35 వేలు వసూలు చేశారు. ప్రజలు చేసిన అప్పులకు వడ్డీలు పెరుగుతున్నాయి. ఈ క్రమంలో ఇళ్ల సాధనకు సిపిఎం ఉద్యమించింది. జిఒ నెంబరు 296, 301, 396, 388 ప్రకారం దాదాపు 66 వేల మందికి పట్టాలు ఇచ్చారు. టిడిపి హయాంలో పట్టా ఇచ్చిన రెండేళ్లలోపు రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉండగా జరగలేదు. దీనికోసం సిపిఎం ఉద్యమిస్తోంది. ట్రూఅప్, సర్దుబాటు ఛార్జీల పేరిట వైసిపి, కూటమి ప్రభుత్వాలు ప్రజలపై మోపిన విద్యుత్ భారాలపై ఎర్రజెండా ఉద్యమాలు నడిపింది. నేటికీ నడుపుతోంది.

భూ ఆక్రమణలకు వ్యతిరేకంగా...

ముడసర్లోవ సమీపంలో 200 ఎకరాలను గత వైసిపి ప్రభుత్వ హయాంలో పెద్దలకు కట్టబెట్టాలని చూడగా సిపిఎం పోరాడింది. విశాఖ కేంద్రంగా రైల్వేజోన్, మెట్రోరైలు, విభజన హామీలైన ఉత్తరాంధ్రకు ప్యాకేజీపై పోరాడుతూనే ఉంది. ప్రజల మౌలిక సౌకర్యాల డిమాండ్లపైనా, జివిఎంసిలో అవినీతిపైనా, కొండవాలు ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలపైనా ఎర్రజెండా ఉద్యమిస్తోంది.

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి చర్యలు చేపట్టాలి

ఇవ్వకపోవడం, ప్రత్యేక హోదాను నిరాకరించడం, విభజన చట్టాన్ని సక్రమంగా అమలుచేయకపోవడమే దీనికి కారణమని అన్నారు. వీటిని అమలు చేసేలా కేంద్రంపై ఒత్తిడి తెచ్చేలా రాష్ట్రంలోని ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేయలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వమైనా తగు కృషి చేయాలని కోరారు. గత పదేళ్ళగా రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిన, చేస్తున్న కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ విశాఖ స్టీల్ ప్లాంటును సైతం అమ్మేయాలని నిర్ణయించిందన్నారు. దీనిని అడ్డుకోవడంలో గత ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని తెలిపారు. నేటి ప్రభుత్వం విశాఖ ఉక్కుకు సమీపంలోనే అనకాపల్లి జిల్లా నక్కవల్లి వద్ద ప్రైవేటు రంగంలో మిట్టల్ స్టీల్ ప్లాంటు, దానికి అనుసంధానంగా ఒక పోర్టును నిర్మిస్తామని ప్రకటించిందని, ఇది కచ్చితంగా విశాఖ స్టీల్ ప్లాంటును బలహీనపరచడమేనన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటుపరమైతే రిజర్వేషన్లకు విఘాతం కలుగుతుందన్నారు. వెంటనే ఆ ప్రతిపాదనను విరమించుకుని, కడపలో ప్రభుత్వ రంగ స్టీల్ ప్లాంట్‌ను నిర్మించాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల సమతుల్య అభివృద్ధి ద్వారానే స్థిరమైన అభివృద్ధి సాధ్యమన్నారు. అత్యంత వెనుకబడిన గిరిజన ప్రాంతంలో నేటికీ రోడ్లు, తాగు నీరు వంటి కనీస మౌలిక వసతులు లేవన్నారు. వాటి ఏర్పాటుకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర విభజన చట్టం సెక్షన్ 94 (3) ప్రకారం రాజధాని నిర్మాణానికి అవసరమైన మౌలిక వసతులు, రాజ్ భవన్, రాష్ట్ర అసెంబ్లీ, సచివాలయం, హైకోర్టు వంటి నిర్మాణ భాధ్యత మొత్తం కేంద్ర ప్రభుత్వానిదేనని తెలిపారు. కానీ ఆ దిశలో రాష్ట్ర ప్రభుత్వం కృషి లేదన్నారు. కేంద్రం నుండి చట్ట ప్రకారం హక్కుగా రావలసిన నిధులు రాబట్టకుండా, ప్రపంచబ్యాంకు, ఎడిబి, హడ్కో వంటి సంస్థల ద్వారా భారీగా అప్పులు చేసి నిర్మించడమంటే మరలా రాష్ట్రం మీద అప్పుల భారం పెరగడమేనని అభిప్రాయపడ్డారు. కేంద్రం నుండి హక్కుగా రావలసిన నిధులు రాబట్టాలని డిమాండ్ చేశారు. కాలుష్యకారక పరిశ్రమల స్థాపన, అవి వెదజల్లే కాలుష్యం, పారిశ్రామిక ప్రమాదాలు, మరణాలు వంటివి నేడు ఉత్తరాంధ్రలో సర్వ సాధారణమైపోయాయని, వీటిని నివారించే చర్యలు ప్రభుత్వం చేట్టాలని కోరారు. అత్యంత ప్రమాదకరమైన కొవ్వాడ అణు విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు.

గత ప్రభుత్వం అదానీ కంపెనీకి చట్టవిరుద్ధంగా పంప్డ స్టోరేజీ ప్రాజెక్టులను ఆదివాసీ ప్రాంతాల్లో నిర్మించడానికి అనుమతులు ఇచ్చిందని, అదానీ కంపెనీకి వేల కోట్ల రూపాయల విలువ చేసే భూమిని విశాఖలో డేటా సెంటర్ ముసుగులో ఇచ్చిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఆ అనుమతులను రద్దు చేసి, ఈ భూమిని వెనక్కు తీసుకోవాలన్నారు. అదానీ గంగవరం పోర్టును రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, విశాఖపట్నం స్టీల్ ప్లాంటుకు అప్పజెప్పాలని కోరారు. ఉమ్మడి రాష్ట్ర అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, ఒకే ప్రాంతం కాకుండా అన్ని ప్రాంతాలను మాటలలో కాకుండా చేతలలో అభివృద్ధి చేసే చర్యలు చేపట్టాలన్నారు. టిడిపి, జనసేనలపై ఆధారపడిన ఎన్‌డిఎ కూటమి కేంద్రంలో అధికారంలో ఉన్న నేపథ్యంలో ఈ అవకాశాన్ని వినియోగించుకుని, చట్ట ప్రకారం పూర్తి స్థాయి నిధులను కేంద్రం నుండి సమీకరించి రాష్ట్ర సమతుల్య అభివృద్ధికి కృషి చేయాలన్నారు.

టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 9 వినతులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 9 వినతులు వచ్చాయని జివిఎంసి చీఫ్ సిటీ ప్లానర్ ఎ.ప్రభాకరరావు తెలిపారు. శుక్రవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో సిపిలు, డిసిపిలు, ఎసిపిలతో కలిసి ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వచ్చిన దరఖాస్తులను నిర్ణీత సమయంలో టౌన్ ప్లానింగు అధికారులు పరిష్కరించాలన్నారు.

మన్మోహన్ సింగ్‌కు ఘననివాళి

ఎక్కడికక్కడ సంతాప కార్యక్రమాలు

విశాఖలో నివాళి అర్పిస్తున్న రామారావు తదితరులు

భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నివాళ్లర్పిస్తూ విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో శుక్రవారం పలుచోట్ల కార్యక్రమాలు చేపట్టారు. ఆయన గొప్పతనాన్ని, సేవలను నాయకులు గుర్తుచేశారు.

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : భారత ప్రధానిగా దశాబ్ద కాలం పాటు అత్యంత నిజాయితీగా పనిచేసిన దార్శనికుడు, సంస్కర్త మన్మోహన్ సింగ్ అని, ఆయన మరణం దేశానికి తీరని లోటు అని రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు లక్కరాజు రామారావు అన్నారు. శుక్రవారం నగర కాంగ్రెస్ కార్యాలయంలో మన్మోహన్ సింగ్ సంస్మరణ కార్యక్రమం జరిగింది. ముందుగా మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మన్మోహన్ సింగ్ భారత దేశం గర్వించదగిన వ్యక్తి అని చెప్పారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ వెస్ట్ సమన్వయకర్త సూర్యనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివకుమార్ పీనమలా, సరస్వతుల మణికంఠ, నగర యువజన అధ్యక్షులు సతీష్ అల్లిపిల్లి, ఎస్సీ విభాగం నాయకులు కస్తూరి వెంకటరావు, మైనారిటీ సెల్ నాయకులు అర్షద్ బాషా, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : మన్మోహన్ మరణం దేశానికి తీరని లోటని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ చైర్మన్ ఆచార్య కెఎస్.చలం, ఆర్‌టిఐ ఫోరమ్ రాష్ట్ర కన్వీనర్ నరవ ప్రకాశ రావు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. జివిఎంసి స్థాయీ సంఘం మన్మోహన్ మృతికి సంతాపం తెలిపింది.

గాజువాక: ఆర్థిక సంస్కర్త, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మరణం దేశానికి తీరని లోటని టిడిపి జిల్లా అధ్యక్షుడు, స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. పార్టీ కార్యాలయంలో మన్మోహన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టిడిపినియోజవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, జనసేన రాష్ట్ర నాయకులు గంధం వెంకటరావు. తమిరి శివప్రసాద్, నంబారు సింహాద్రి, నెల్లి సాధూరావు, రట్టి వాసు పాల్గొన్నారు .

తగరపువలస : స్థానిక ఆదర్శ హిందీ ప్రేమీ మండలి ఆధ్వర్యంలో భీమిలిలో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండలి అధ్యక్షులు కెఎస్ఆర్ కృష్ణారావు, గౌరవాధ్యక్షులు గంటా నూకరాజు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు

మాధవధార : 30 ఏళ్ల క్రితం మనోహన్‌సింగ్ చేపట్టిన ఆర్థిక సంస్కరణలు, విధాన నిర్ణయాలు నాడు దేశ ఆర్థిక వ్యవస్థను గాడీన పెట్టడమే కాకుండా, నేడు అధిక వృద్ధిరేటు సాధన దిశగా దేశాన్ని నడిపించేందుకు దోహదపడ్డాయని పిసిసి ప్రధాన కార్యదర్శి మూల వెంకటరావు అన్నారు. అనేక ఆర్థిక సంస్కరణలు, వినూత్న కార్యక్రమాలతో దేశ ఆర్థికాభివృద్ధికి ఆయువు పోసిన మన్మోహన్ మరణం తీరని లోటన్నారు. ఆయన మృతికి సంతాపం ప్రకటించారు. సావరిన్ డి పాల్ట్ ముప్పు నుంచి దేశాన్ని గట్టెక్కించడం, ప్రయివేటు బ్యాంకుల జాతీయీకరణ, నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ ఏర్పాటుతోపాటు స్క్రీన్ ఆధారిత ట్రేడింగ్ ప్రవేశపెట్టడం, నేషనల్ రూరల్ హెల్త్‌మిషన్, జవహర్‌లాల్ నెహ్రూ అర్బన్ రెన్యువల్ మిషన్ ప్రారంభం, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల ఏర్పాటు, గ్రామీణ పేదలు, రైతులకు రుణలభ్యతకు పలు సేవలను ప్రారంభించడం వంటి ఎన్నో ఆర్థిక, సామాజిక సంస్కరణలతో భారత్‌ను ప్రపంచంలోనే ఉన్నతస్థానంలో నిలబెట్టేందుకు తనదైన కృషిని మన్మోహన్ చేశారని కొనియాడారు.

మాడుగుల: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరని లోటని మాడుగుల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పడాల కొండలరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో స్థానిక బస్టాండ్ వద్ద మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యేసు రాజు, రాజు, అమరయ్య శెట్టిగుప్త పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్ : కాంగ్రెస్ పార్టీ నర్సీపట్నం టౌన్ అధ్యక్షుడు నంగిన రమణ, జిల్లా అధ్యక్షుడు మీసాల సుబ్బన్న ఆధ్వర్యంలో పట్టణంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాకవరపాలెం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొంతు రమణ, జిల్లా కార్యవర్గ సభ్యులు రామారావు పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్ మృతి పట్ల శాసనసభాపతి స్పీకర్ అయ్యన్నపాత్రుడు సంతాపం వ్యక్తం చేశారు. మన్మోహన్ సింగ్ ఎప్పటికీ దేశ చరిత్రలో అజరామరంగా నిలిచిపోతారని ఆయన అన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ రాజాన వీర సూర్యచంద్ర సంతాపం వ్యక్తం చేశారు.

అనకాపల్లి : స్థానిక రింగ్ రోడ్డు వైసిపి కార్యాలయంలో మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ చిత్ర పటానికి వైసిపి అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు దంతులూరి దిలీప్ కుమార్, మందపాటి జానీ, గొర్లి సూరిబాబు, పెద్దిశెట్టి గోవింద, జాజుల రమేష్ కెఎం నాయుడు, ఉగ్గిన అప్పారావు పాల్గొన్నారు.

పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయాల్లో ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, శాసనమండలి మాజీ సభ్యులు బుద్ధ నాగ జగదీశ్వరరావు వేర్వేరుగా మనోహ్మన్ సింగ్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కాండ్రేగుల సత్యనారాయణ, కుప్పిలి జగన్, సాలాపు నాయుడు, మారిశెట్టి శంకర్రావు పాల్గొన్నారు.మాజీ ప్రధాని మన్మోహన్ సింగి చిత్ర పటానికి ఉత్తరాంధ్ర చర్చ వేదిక నాయకులు బుద్ద రాజేష్ పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో లంకెలపల్లి సూర్యనారాయణ, బుద్ధ రాధా, పాలవలస రాము, లోకేష్, శ్రీను పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని తిమ్మరాజుపేట జంక్షన్‌లో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి కాంగ్రెస్ నియోజకవర్గం ఇన్‌ఛార్జి తనకాల అనంతరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంవిఆర్ రాహుల్, పొలమర శెట్టి ఆదిమూర్తి, చోడిపల్లి సుభద్రరావు, కాండ్రేగుల సంజీవ్, ఎల్లపు రాము పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల దగ్ధం

బిల్లులు దగ్ధం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర ప్రజలపై తీవ్రస్థాయిలో మోపిన విద్యుత్ భారాలను నిరసిస్తూ శుక్రవారం పందిమెట్ట జంక్షన్‌లో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్ బిల్లులను దగ్ధం చేశారు. పార్టీ జగదాంబ జోన్ కమిటీ సభ్యులు ఆర్.వరలక్ష్మి ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం కరెంటు ఛార్జీల బాదేసిందంటూ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు అవే విధానాలను దొడ్డిదారిన అమలు చేయడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.మణి, కె.చంద్రశేఖర్, కె.నర్సింగరావు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

కెజిహెచ్‌లో ఉన్నతంగా సేవలు

విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్‌లో విలువైన వైద్య సేవలు అందుతున్నాయని రాష్ట్రపతి ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వై.దేముడు అన్నారు. శుక్రవారం కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానందను ఆయన కలిసి అభినందించారు.

GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION
VISAKHAPATNAM

REQUEST FOR PROPOSAL

Tender Notice No. 18/2024-25/SE(WSM&S)/E.E-II (WS-M)/DB/ dt.: 27-12-2024.
Number of work:- Request for proposal from consulting agencies for Detailed Project Report for Study, Up-gradation, Refurbishment, Improvement & Automation of Mini STPs with quality monitoring of Waste water in Greater Visakhapatnam Municipal Corporation.
Downloading Starting Date 27-12-2024 @ 3.00 PM
Downloading Ending Date: 10-01-2025 @ 3.00 PM
Opening of bid: 10-01-2025 @ 4.00 PM.
Note : Further details @ www.gvmc.gov.in
O/o. EE-II(WSM)-8187898428
Sd/- Commissioner

IN THE HONOURABLE COURT OF THE METROPOLITAN SESSIONS JUDGE AT VISAKHAPATNAM
Tr.Crl.M.P 56/2023
Between
Dwarampudi Satyanarayana Reddy ...Petitioner
And
Smt.Alla Veenamadhavi and anotherr ...Respondents

NOTICE

To
Smt.ALLA VEENA MADHAVI W/O RAJA RAO, HINDU, AGE 42 YEARS, D.NO: 45-2-60/60/2/7, Ramachandranagar, Akkayapalem, Visakhapatnam-16.

Take notice that the above named Petitioner has instituted the above numbered Transfer Petition against you "to withdraw the case no. CC 25/18 pending on the file of Honourable III Spl. Magistrate court, Visakhapatnam and to transfer the same to any other Honourable Court, Visakhapatnam for adjudication and the same is posted to 08-01-2025 for your appearance, you are hereby summoned to appear in the court of Hon'ble Metropolitan Sessions Judge, Visakhapatnam at 10-30 A.M. either in person or by pleader duly instructed and able to answer all material questions relating to the above petition on **08-01-2025 at 10-30 A.M.** in default of your absence on that day the petition will be heard and determined in your absence.

(By Court Order)
J Devi Prasad, J.P.Ranga,
Advocates, F.No.204, Anandamani Apartments Kummari Street, Visakhapatnam

ప్రయాణ సంకటం!

అడుగడుగునా గోతులతో రహదారులు

రాకపోకలకు వాహనదారుల అవస్థలు

తరచూ ప్రమాదాలపై జనం ఆందోళన

నిండా గోతులమయమైన రహదారి

ప్రజాశక్తి -పద్మనాభం : అడగడుగునా గోతులు, అనేక చోట్ల పూర్తిగా రూపుకోల్పోయిన రోడ్డుతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు, ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో పద్మనాభం నుంచి రెడ్డిపల్లి శాంతినికేతన్ వరకు, అలాగే విజయానందపురం నుంచి గణేష్ జ్యూట్ మిల్లు వరకు రోడ్డు నిండా గోతులమయం కాగా, ఇటీవల కురిసిన వర్షాలకు ఆయా గోతుల్లో వర్షపునీరు నిండిపోవడంతో రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఏమాత్రం ఆదమరిచినా ప్రమాదాలకు గురయ్యే పరిస్థితులున్నాయని ఆవేదన చెందుతున్నారు. సంక్రాంతి నాటికి రోడ్లలో గోతులు లేకుండా చేస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో మండలంలో అధ్వానంగా రోడ్లపై కూడా అధికారులు దృష్టి పెట్టి తక్షణ మరమ్మతులు చేపట్టాలని, తర్వాత శాశ్వత ప్రాతిపదికన పునర్నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

రేపు పోర్టు పెన్షనర్ల సమావేశం

ప్రజాశక్తి -మాధవధార : హార్బర్ అండ్ పోర్ట్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం, వనసమారాధన ఈనెల 29న న మాధవధార మాధవ స్వామి ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు చౌదరి అప్పారావు తెలిపారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వీహెచ్అండ్పిడబ్ల్యూ యూనియన్ జనరల్ సెక్రెటరీ బిసిహెచ్ మసేను, విశాఖ స్టీల్‌ప్లాంట్ విశ్రాంత ఉద్యోగి పైడి శంకరరావు, కోర్టు అధికారులు పాల్గొంటారనిన్నారు. అసోసియేషన్ సభ్యుల ంతా సకాలానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

యుటిఎఫ్ స్వర్ణోత్సవ

మహాసభలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి- గాజువాక : వచ్చేనెల 5 నుంచి 8 వరకు కాకినాడ పిఆర్ కాలేజీలో జరగనున్న 17వ ఎపి యుటిఎఫ్ విద్యా, వైజ్ఞానిక స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని ఆ యూనియన్ రాష్ట్ర కార్యవర్గసభ్యులు టి అప్పారావు కోరారు. శుక్రవారం శ్రీనగర్‌లో యుటిఎఫ్ గాజువాక మండలశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, మహాసభలను విజయవంతానికి శ్రీకాకుళంలో ప్రారంబి ంచిన యుటిఎఫ్ ప్రచార యాత్ర శనివారం ఉదయం 8.30గంటలకు విశాఖ జిల్లా తగరపువలసతో ప్రవేశి స్తున్న నేపథ్యంలో అధిక సంఖ్యలో యూనియన్ నేతలు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొనాలని కోరారు.
యుటిఎఫ్‌జిల్లా కార్యదర్శి మొహమ్మద్ రిజ్వాన్, సీనియర్ నాయకులు నెల్లి సుబ్బారావు మాట్లాడుతూ గాజువాక మండల పరిధిలో అనేక ఉపాధ్యాయ సమస్యలు తమ దృష్టికి వచ్చాయని, వాటి పరిష్కారానికి త్వరలో ఎంఇఒ బి.విశ్వనాధంను కలవనున్నట్లు తెలిపారు. సమావేశంలో యూనియన్ అధ్యక్షులు ఎస్‌వి. శ్రీనివాస్, సహాధ్యక్షులు బి,సుగుణ, కోశాధికారి కె.చెల్లారావు, మండల కార్యవర్గ సభ్యులు ఎం. అనితకుమారి, ఎస్..నిరుపమా పరదేశి, వై.రాంబాయి, ఎస్. అపరంది, ఆడిట్ కమిటీ సభ్యులు, జిల్లా కౌన్సిలర్ ఎ.విజయకుమారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి.అప్పారావు, నూకరాజు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న యుటిఎఫ్ నేతలు

అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యాబోధన

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విద్యాబోధన నిర్వహిస్తున్నట్లు గీతం ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు వెల్లడించారు. శుక్రవారం 1990–95 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమక్షంలో ఆధునికీకరి ంచిన నూతన తరగతి గదులను, ఇతర సదుపాయాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గీతం విద్యార్థులను ఉన్నత స్థానంలో నిలపడానికి, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడానికి అనువైన వాతావరణాన్ని నెలకొల్పుతున్నామన్నారు.
గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు మాట్లాడుతూ మేనేజ్‌మెంట్ విద్యలో అండర్ గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సులను సమకాలీన అంశాలతో ఎటా మార్పు చేస్తున్నామని, పారిశ్రామిక అవసరాలకు తగిన విధంగా మానవ వనరులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. ఎంబిఎ విద్యార్థులకు కేస్ స్టడి ఆధారంగా బోధన ఉంటుందని తద్వారా క్షేత్రస్థాయిలో సహితం పనిచేసే సామర్థ్యం కలుగుతుందన్నారు. ప్రపంచంలోని ఏడు ప్రముఖ విశ్వవిద్యాలయాలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంటున్నామని ఆయా దేశాల విద్యార్థులు సహితం గీతంలో తరగతులకు హాజరవుతారనివెల్లడిరచారు. గీతం బిజినెస్ స్కూల్ అధ్యాపకులకు సహితం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమాల ద్వారా నూతన అంశాలను నేర్చుకునే అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా మారాలనుకునే విద్యార్థుల కోసం దాదాపు రూ. 75 కోట్లతో గీతం విశాఖ, హైదరాబాద్ బెంగళూరు ప్రాంగణాలలో ఇంక్యుబేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రానున్న సంవత్సరాలలోగీతం స్కూల్ ఆఫ్ బిజినెస్‌ను ప్రపంచంలో మేటి వాణిజ్య విద్యా కేంద్రంగా మార్చడానికి ప్రణాళికాయుతంగా కృషి చేస్తున్నామని, దీనికి పూర్వ విద్యార్థుల విలువైన సూచనలు, సలహాలు పరిగణనలోకి తీసుకుంటామని వెల్లడిరచారు. ఈ సందర్భంగా అధ్యాపకులతో కలిసి విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గీతం స్కూల్ బిజినెస్ ఇన్‌ఛార్జి డైరక్టర్ డాక్టర్ కె.లూబ్జా నిహర్, అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ సాయిసుధాకర్, ప్రొఫెసర్ పి.షీలా, డాక్టర్ జోసఫ్ పాల్, వివిధ విభాగాల అధిపతులు, ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు.

నూతన తరగతుల ప్రారంభిస్తున్న విసి గౌతంరావు

నేరాలు ఘోరాలు

ట్రాక్టర్‌ను ఢీకొట్టి బైకిస్ట్ దుర్మరణం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందాడు. శుక్రవారం సాయంత్రం పాత కృష్ణదేవిపేట ఎస్సీ కాలనీకి చెందిన చెందిన ముగ్గురు వ్యక్తులు నర్సీపట్నం నుండి ద్విచక్ర వాహనంపై స్వగ్రామం వెళుతున్నారు. గొలుగొండ ఎస్సీ కాలనీ వద్ద ఆగి ఉన్న ట్రాక్టర్ ను బలంగా ఢీకొట్టారు. ఈ సంఘటనలో పెదపూడి రాజేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన ఇద్దరికి గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. గొలుగొండ ఎస్సై రామారావు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక, పోలీస్ స్టేషన్ పరిధి జగ్గయ్యపాలెం రైల్వే క్యాబిన్ సమీపంలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. సిఐ పార్థసారధి తెలిపిన వివరాలివి. సుమారు 30 ఏళ్ల వయస్సున్న వ్యక్తి కుడిచేయి, పాదాలు కాలిపోయి ఉన్నట్లు గుర్తించామన్నారు. స్కైబ్లూ రంగు షర్టు, నలుపు ప్యాంటు ధరించి ఉన్న మృతుని వివరాలు తెలిస్తే, 9440796014, . 9440904325 ఫోను నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

‘ప్రీ హోల్డ్’ భూసమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి- సీతమ్మధార : అసైన్డ్ భూముల ఫ్రీ హోల్డ్ బాధితుల సమస్యలను పరిష్కరించాలని నవయానం బహుజన సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి వెంకటరమణ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం అంబేద్కర్ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ జిఒ 596 ద్వారా గత ప్రభుత్వం సుమారుగా 300 మందికి సంబంధించిన 609 ఎకరాలకు ఫ్రీహోల్డ్ సౌకర్యం కల్పించి, అమ్ముకునే అవకాశం కల్పించిందన్నారు. అయితే ఈ వ్యవహారంలో 135 ఎకరాల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు నేపథ్యంలో ఏకసభ్య కమిషన్ అవాస్తవాలని తేల్చేసిందన్నారు.. విశాఖ జిల్లాలో 6,738 ఎకరాల ఆసైన్డ్ భూముంటే, వాటిలో 609 ఎకరాలకు మాత్రమే ఫ్రీహోల్డ్ హక్కు లభించినది తెలిపారు. మిగిలిన భూములను కూడా ప్రీహోల్డ్ జాబితాలో చేర్చి, జిఒ 596 ద్వారా అవసరాలకు అమ్ముకునే అవకాశాన్ని కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. నాలుగు వేల ఎకరాలు రిజిస్ట్రేషన్ కావాల్సి ఉండగా, 171 ఎకరాలను మాత్రమే అమ్ముకున్నారన్నారని, దీనిపై కొందరు నేతలు తమ అసత్య ఆరోపణలతో హక్కుదారులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. సమావేశంలో రెడ్డిపల్లి ఫ్రీహోల్డ్ అసైన్డ్ భూముల బాధితులు బోనీ బంగారయ్య, దుమ్మిితి నరసయ్యమ్మ, బోని చంద్రరావు, కుడితి అచ్యుత, మద్దెల రామారావు, డమరసింగ్ శంకరరావు, అయినాడ శంకరరావు ఉన్నారు

రెడ్‌క్రాస్ సమావేశం వాయిదా

ప్రజాశక్తి- విశాఖపట్నం : ఈనెల 29న జరగాల్సిన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సర్వసభ్య సమావేశం వాయిదా పడిందని సొసైటీ కార్యదర్శి పి.రవికుమార్ ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వాయిదా పడిన సమావేశం మళ్లీ ఎపుడు నిర్వహించేది తెలియజేస్తామని వెల్లడించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 9వ వార్డు హనుమంతువాక కొండవాలు ప్రాంతంలో పలు అభివృద్ధి పనులకు శుక్రవారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, వార్డు కార్పొరేటర్ కోరుకొండ స్వాతి దాస్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. రూ 37.80 లక్షల జివిఎంసి లక్షల నిధులతో రెండు రిటర్నింగ్ వాల్స్, రైలింగ్ నిర్మాణం చేపట్టనున్నారు. జివిఎంసి వర్క్స్ ఎఇఇ వెంకటరావు, వార్డు టిడిపి ఇన్‌చార్జి బుడుమూరు గోవిందు, ఒమ్మి అప్పలరాజు, ఒమ్మి పోలారావు, ఉమ్మడి దాసు, బాలరాజు పాల్గొన్నారు.

కొండవాలులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఆత్మహత్య బాధ్యులపై చర్యలు తీసుకోండి

గొల్లలపాలెంలో బాధిత కుటుంబీకులు, గ్రామస్తుల ఆందోళన

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం టి నగరపాలెం, గొల్లలపాలెంలో ఇటుకల బట్టీలు నిర్వహిస్తూ, ఇటీవల ఆత్మహత్య చేసుకున్న బొట్టా శ్రీనివాసరావు (52) మృతికి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ శుక్రవారం కుటుంబసభ్యులు, గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. అల్లుడు, అతని కుటుంబ సభ్యుల వేధింపులే ఆత్మహత్యకు కారణమని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. 25న సొంతూరు నెల్లూరు జిల్లా, కనిగిరిలో తల్లిదండ్రుల ఇంటి వద్దనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న శ్రీనివాసరావు మృతదేహం, శుక్రవారం గ్రామానికి తీసుకురాగా, కుటుంబ సభ్యులతోపాటు గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. మృతుని భార్య వరలక్ష్మి, కుమార్తె యామిని బాధిత కుటుంబీకులు, పలువురు గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం...
టి నగరపాలెంలో ఇటుక బట్టీల వ్యాపారంతో జీవనం సాగిస్తున్న శ్రీనివాసరావుకు కుమార్తె యామిని, కుమారుడు కిషోర్ ఉన్నారు.కుమార్తె యామినికి జివిఎంసి రెండో వార్డు సంగివలస గ్రామానికి చెందిన అక్కరమాని చంద్రశేఖర్‌తో వివాహమైంది. రెండేళ్ల వరకూ కాపురం సాఫీగా సాగగా, వారికి మూడేళ్ల కొడుకు గీతాంశ్ ఉన్నాడు. దంపతుల మధ్య చిన్నపాటి మనస్పర్థలతో మూడేళ్ల గీతాంశ్‌ను చంద్రశేఖర్ ఇంటి వద్దే ఉండడంతో తండ్రీ, కూతుళ్లిద్దరూ కలత చెందారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదుతోపాటు పెద్దల సమక్షంలో చర్యలు జరిగినా సమస్య పరిష్కారం కాకపోవడంతో ఈ ఏడాది జనవరి 1న యామిని ఆత్మహత్యకు యత్నించింది. అయినా రాజకీయ పలుకుబడి, ఆర్థికంగా స్థితిమంతులు కావడంతో సమస్య పరిష్కారం కావడం లేదనే మనస్తాపంతో ఉన్న శ్రీనివాసరావు ఈనెల 25న బలవన్మరణానికి పాల్పడ్డాడని మృతుని భార్య, కుమార్తె ఆరోపిస్తున్నారు. ఈ సందర్భంగా తన ఆత్మహత్యకు కారణాలతో మృతుడు ఎనిమిది పేజీల లేఖరాయగా, అందులో సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం, పవన్ కళ్యాణ్, స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పేర్లను ప్రస్తావించాడు. మృతుల కుటుంబాన్ని టిడిపి మండల అధ్యక్షులు డిఎవన్ రాజు, టి నగరపాలెం, తాటితూరు గ్రామ పెద్దలు పొట్నూరు చంద్రశేఖర్, పల్లా సన్యాసిరావు, రాము, వెంకటరమణ పాత్రుడు, పూసర్ల రామారావు, సిరిగిడి ఈశ్వర రావు, దుంపల ప్రభాకర్ తదితరులు పరామర్శించి, ఓదార్చారు.
బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ కుటుంబ సభ్యులతోపాటు ,గ్రామస్తులు గొల్లల పాలెంలో రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. సంఘటనా స్థలానికి సిఐ సుధాకర్, ఎస్ఐ హరీష్ చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. కాగా పెద్దల సమక్షంలో ఒప్పందం కుదిరి, ఆందోళన విరమించడంతో మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

మృతదేహం వద్ద రోదిస్తున్న బాధిత కుటుంబీకులు, గ్రామస్తులు

సిపిఎం జిల్లా మహాసభకు తరలిరండి

★ పలుచోట్ల పార్టీ పతాకావిష్కరణలు ★ బైక్ ర్యాలీలతో విస్తృత ప్రచారం ★ వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ

ఈనెల 28,29 తేదీల్లో పెందుర్తి, సుజాతనగర్‌లో నిర్వహించే సిపిఎం 24వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ పలుచోట్ల పార్టీ జెండాలను, వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. బైక్ ర్యాలీలను నిర్వహించి విస్తృతంగా ప్రచారం చేశారు.

ప్రజాశక్తి- పెందుర్తి : ఈనెల 28, 29 తేదీలో పెందుర్తి సుజాతనగర్‌లో నిర్వహించే సిపిఎం 24వ జిల్లా మహాసభ జయప్రదం చేయాలని కోరుతూ సుజాతనగర్‌లో ఆటో ప్రచార రథాన్ని 78 వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి గంగారావు ప్రారంభించారు. 28న ఉదయం 10 గంటలకు పెందుర్తి జూనియర్ కాలేజీ నుంచి సుజాతనగర్ వరకు మహాప్రదర్శన, బహిరంగ సభలో కష్టజీవులు, కార్మికులు ప్రజలు విద్యార్థి యువజనులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి, పేదోడికి ఇళ్లు, విద్యుత్ ఛార్జీలు, నిత్యావసరాల ధరల తగ్గింపు, పంచగ్రామాల భూసమస్య , 22ఎ భూ సమస్య పరిష్కారం, జిఓలు 296, 388 ప్రకారం .జారీచేసిన పట్టాల రిజిస్ట్రేషన్, అందరికీ నాణ్యమైన విద్య, మహిళలపై దాడులు అరికట్టడం, సూపర్‌సిక్స్ పథకాల అమలు, లేబర్‌కోడ్‌లను రద్దుచేసి, కార్మిక చట్టాల పటిష్ట అమలు, ఇతర అన్ని వర్గాల సమస్యలపై మహాసభలో చర్చించి భవిష్యత్ కార్యాచరణ, తీర్మానాలు ఉంటాయన్నారు. జోన్ కార్యదర్శి బి జగన్, జిల్లా కమిటీ సభ్యులు బి రమణ, జోన్ నాయకులు ప్రభుదేవా, అన్నపూర్ణ, లక్ష్మి, మహాలక్ష్మి, ముత్యాలమ్మ, అప్పల నరసమ్మ, నూకరాజు సంతోష్, పైడిరాజు,దేవి పాల్గొన్నారు.

అలాగే అప్పల నరసయ్య నగర్, ,చైతన్యనగర్, వీరానగర్, జ్యోతి నగర్ తదితర ప్రాంతాల్లో సిపిఎం మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు.నాయకులు బి. రమణి, వెంకటలక్ష్మి, ఈశ్వరమ్మ, తిరుపతిరావు రమణమ్మ, ధన, సరోజిని, రవణమ్మ పాల్గొన్నారు

తగరపువలస : సిపిఎం 24వ జిల్లామహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ మండలంలోని బోడమెట్ట పాలెం క్వారీ వద్ద పార్టీ నాయకులు ముద్దాడ రాము ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. క్వారీ కార్మికులు అప్పల నాయుడు, నరసింగరావు, , డి రమణ, రాము తది తరులు పాల్గొన్నారు ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు.

పెందుర్తిలో ఆటో ప్రచార వాహనాన్ని ప్రారంభిస్తున్న గంగారావు

మధురవాడ : సిపిఎం విశాఖ జిల్లా 24వ మహాసభలు సందర్భంగా కొమ్మాది కార్యాలయం వద్ద పార్టీ జెండాను మధురవాడ ప్రాంత నాయకులు బి భారతి ఆవిష్కరించారు. నాయకులు డి కొండమ్మ, డి. అప్పలరాజు, కె.సుజాత, కె.మణి, టికె.శారద, కె.పుష్ప, కె.కుమారి, డి. శైలు, కె.పద్మ పాల్గొన్నారు.

గాజువాక.: సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని అక్కిరెడ్డిపాలెంలో శుక్రవారం జెండా ఆవిష్కరించారు. సిపిఎం జోన్ నాయకులు ఎ. నూకేశ్వరావు, జె. కోటేశ్వరరావు, దాసరి అప్పారావు, ఎం సుబ్బన్న, ఆంజనేయులు జె.శ్రీలక్ష్మి, బాలరాజు, నానాజీ పాల్గొన్నారు.

పెదగంట్యాడలో బైక్ ర్యాలీ

సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పెదగంట్యాడ స్టీల్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీని స్టీల్ జోన్ కమిటీ కార్యదర్శి. పి శ్రీనివాసరాజు జెండా ఊపి ప్రారంభించారు. ఇటీవల ఢిల్లీ వెళ్లిన సిఎం చంద్రబాబు, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ, గనుల కేటాయింపుపై ప్రస్తావించడం మానేసి, ఇంకా పునాది రాయి వేయని మిట్టల్ ఫ్యాక్టరీకి గనులు కేటాయించాలని కోరడం శోచనీయమన్నారు, ఉక్కు ఉద్యోగులకు నాలుగు నెలలుగా వేతనాలు లేకున్నా స్పందన లేదన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి, ఉక్కు పరిరక్షణకు సిపిఎం పోరాడుతుందన్నారు. దీనిపై పెదగంట్యాడ గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు. జి శ్రీనివాసరావు. నమ్మి రమణ డి వెంకటరావు బి గురప్ప. సి హెచ్ రాముడు. బి సింహాచలం. బి ఆనంద్. నమ్మి సన్యాసిరావు పాల్గొన్నారు.

జోగావానిపాలెంలో సిపిఎం పతాకావిష్కరణ.

జివిఎంసి 67వ వార్డు పరిధి జోగవానిపాలెంలో సిపిఎం పతాకాన్ని పార్టీ సీనియర్ నాయకులు యువి ఎస్ఎన్ వర్మ ఆవిష్కరించారు. కె.కిరీటం, పాలూరు లక్ష్మణస్వామి మాట్లాడుతూ, సమసమాజ నిర్మాణం, కార్మిక, కర్షకులు, బడుగుల సంక్షేమానికి పోరాడుతున్న సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ రమేష్ కుమార్, కె.సంతోషం, ప్రతాప్ కుమార్, పాల్గొన్నారు.

ఉక్కునగరం: ప్రజల్లో అవగాహన పెంచి ప్రజా పోరాటా లను మరింత ఉధృతం చేయడం ద్వారానే విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ సాధ్యమని, దాని సాకారానికి

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న స్టీల్ సిపిఎం నేతలు, కెఎం శ్రీనివాస్,తదితరులు

సిపిఎం ఆది నుంచి ఉద్యమిస్తోందని ఆ పార్టీ జిల్లా నాయకులు కెఎం. శ్రీనివాస్ అన్నారు. 86వ వార్డు కూర్మన్నపాలెం షకీలాల్ కూడలి వద్ద సిపిఎం జిల్లా మహాసభల వాల్‌పోస్టర్లను, జెండాను ఆవిష్కరించారు. మార్కెట్లో కరపత్రాలను పంచారు.ఇప్పటివరకు మాటలు, ప్రకటనలకే పరిమితమైన స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ, కార్మిక సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి సాధించేందుకు మహాసభల్లో తీర్మానించి, పోరాట కార్యాచరణ రూపొందించాల్సిన తక్షణ అవసరం ఉందన్నారు. 28న పెందుర్తిలో మహాప్రదర్శన, బహిరంగ సభ జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ముందుగా సిపిఎం నాయకులు డిసిహెచ్ వెంకటేశ్వరరావు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. పార్టీ నాయకులు ఎం కృష్ణారావు, కె గంగాధర్, దత్తాత్రేయ రాజు, జి సూరిబాబు, గోపాలకృష్ణ రాజు, కృష్ణార్జున, అప్పారావు, ఎంవి రమణ, శివరావు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : సిపిఎం జిల్లా మహాసభను జయప్రదం చేయాలంటూ పంది మెట్ట జంక్షన్‌లో పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కెవిపి.చంద్రమౌళి, కె.నరసింగరావు, సుబ్బారావు, మణి, డివైఎఫ్ఐ నాయకులు కె.సంతోష్ కుమార్, మత్స్యకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గాజువాకలో సిపిఎం జెండా ఆవిష్కరణలో నేతలు

కష్ట జీవుల పత్రిక ప్రజాశక్తి

ప్రజాశక్తి కేలండర్ ఆవిష్కరిస్తున్న బసవరాజు

ప్రజాశక్తి- సీతమ్మధార : కష్టజీవుల పక్షాన నిలిచిన పత్రిక ప్రజాశక్తి అని పద్మ పూజిత వీల్స్ మార్ట్ అధినేత బసవరాజు అన్నారు. శుక్రవారం దొండపర్తిలోని సంస్థ కార్యాలయంలో ప్రజాశక్తి 2025 నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికుల పక్షాన నిలబడి, వారి కష్టసుఖాలు తెలుసుకుంటూ, సమస్య లను అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషిచేస్తున్న ప్రజాశక్తి సేవలు అభినందనీయమని కొనియాడారు. నిష్పక్షపాతంగా కథనాలను వెలువరిస్తూ, ప్రజలకు, పాలకులకు వారధిగా ఉన్న ప్రజాశక్తి మరింత అభివృద్ధి చెందాలని, అపుడే ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి శ్రీనివాసరావు, సాయిబాబు పాల్గొన్నారు.

డిఎవి పాఠశాల విద్యార్థుల విరాళం

విరాళం అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

ప్రజాశక్తి- ఉక్కునగరం : ఫ్లాగ్ డేను పురస్కరించుకొని ఉక్కునగరం డిఎవి పాఠశాల యాజమాన్యం, సిబ్బంది, విద్యార్థులు సైనికుల పట్ల గౌరవభావాన్ని చాటుకున్నారు. శుక్రవారం విశాఖ స్టీల్ ఎక్స్‌సర్వీస్‌మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డి.ఎవి స్కూల్ యాజమాన్యం, సిబ్బంది, విద్యార్థులు మాజీ సైనికుల కుటుంబాలకు, వితంతు సైనిక కుటుంబాలకు రూ.11వేలు విరాళాన్ని అందజేశారు. ప్రతి ఒక్కరూ సైనిక కుటుంబాలకు అండగా నిలవాలని అసోసియేషన్ అధ్యక్ష , కార్యదర్శులు మోహనరావు, బొండా మహేష్ విజ్ఞప్తి చేసారు. విరాళం అందజేసిన డిఎవి స్కూల్ యాజమాన్యానికి అసోసియేషన్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు శివ గణేష్, బిఎం స్వైన్ పాల్గొన్నారు.

'గణతంత్ర' కవాతుకు ఎక్యూజె విద్యార్థి

గణేష్‌కు నగదు ప్రోత్సాహకం అందిస్తున్న కాలేజీ కరస్పాండెంట్

ప్రజాశక్తి-ఆనందపురం : వచ్చేనెల 26న ఢిల్లీలో నిర్వహించే గణతంత్ర దినోత్సవ పరేడ్‌కు మండలంలోని పాలవలస గ్రామ పంచాయతీలోని ఎక్యూజెక్యూజే కళాశాల ఎంసిఎ ఫస్టియర్ విద్యార్థి యు.గణేష్ ఎంపికయ్యాడు. ఈ మేరకు ఆంధ్ర యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగ అధికారి ధ్రువీకరణ పత్రం జారీ చేసినట్లు కళాశాల సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా గణేష్‌ను కళాశాల కరస్పాండెంట్ ఐహెచ్ ఫారుఖీ అభినందించి రూ.పదివేలను అందజేశారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ పి.సుధారాణి మాట్లాడుతూ గణేష్‌లాగే మిగతా విద్యార్థులు కూడా మంచి పేరు తెచ్చుకొని ఉన్నత శిఖరాలకు వెళ్లాలని ఆకాంక్షించారు. గణేష్‌ను కాలేజీ ఎన్ఎస్ఎస్ పిఒ పవన్‌కుమార్, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

కాంటాక్ట్ లెన్స్‌లపై అపోహలు వద్దు

● ఎల్‌వి ప్రసాద్ కంటి ఆసుపత్రి ఆప్తమాలజిస్ట్ డాక్టర్ గౌతమి

డాక్టర్ గౌతమి

ప్రజాశక్తి - ఆరిలోవ : కంటిచూపును సరిదిద్దేందుకు కళ్లద్దాలకు బదులుగా వాడే కాంటాక్ట్ లెన్స్‌లపై ఎటువంటి అపోహలు వద్దని జిఎంఆర్ వరలక్ష్మీ క్యాంపస్ ఎల్‌వి ప్రసాద్ కంటి ఆసుపత్రి ఆప్తమాలజిస్ట్ డాక్టర్ నందలి గౌతమి అన్నారు. శుక్రవారం ఎల్‌వి. ప్రసాద్ కంటి ఆసుపత్రిలో కాంటాక్ట్ లెన్స్‌ల వాడకంపై ప్రజల్లో ఆపోహలు, సందేహాలను నివృత్తికి అవగాహన కల్పించారు. కాంటాక్ట్ లెన్స్ అనేవి సౌందర్య ప్రయోజనాల కంటే కంటి కార్నియాపై అమర్చే ఒక వైద్య పరికరం మాత్రమే అన్నారు. కంటి చూపును సరిదిద్దేందుకు కళ్ళద్దాలు బదులుగా కాంటాక్ట్ లెన్స్ వినియోగిస్తారన్నారు. కళ్ళద్దాలతో పోలిస్తే చక్కటి దృష్టిని అందిస్తాయన్నారు. సాంప్రదాయ అద్దాలతో సరికాక, సవాలుగా ఉన్న నిర్దిష్ట కంటిచూపు కోసం కాంటాక్ట్ లెన్స్‌లు అమర్చుతారన్నారు. కాంటాక్ట్ లెన్స్‌ల్లో చాలా రకాలున్నాయని, నిపుణులను సంప్రదించి, కార్నియా వక్రతను ప్రాథమిక స్కాన్ ద్వారా నిర్ధారించిన తర్వాత సూచించిన కాంటాక్ట్ లెన్స్ వాడాలన్నారు. కాంటాక్ట్ లెన్స్‌లు అపరిశుభ్రమైన నీటితో శుభ్రం చేయకూడదన్నారు. కాంటాక్ట్ లెన్స్‌లను ఈత కొట్టే సమయం లోనూ, స్నానం చేసే ముందు వాటిని తీయటం మంచిద న్నారు. లెన్స్‌ను పెట్టుకునే ముందు చేతులను సబ్బు, నీటితో శుభ్రం చేసుకోవడం మంచిదన్నారు.

బ్యాంకు ఖాతాదారులకు ఉచిత వైద్యసేవలు

ప్రజాశక్తి -మధురవాడ : కోస్టల్ బ్యాంకు సిల్వర్ జూబ్లీ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం కొమ్మాది కూడలి బ్రాంచ్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మెడికవర్ ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన వైద్యశిబిరాన్ని బ్రాంచ్ మేనేజర్ ఎస్‌కె. నాజిమ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఖాతాదారులతో బ్యాంకు వచ్చిన వారందరికీ వైద్యపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు.కార్యక్రమంలో ఎబిఎం హనిష్, ఎ.గోవింద్ పాల్గొన్నారు.

తప్పిన పెద్ద ప్రమాదం

● కూలిన పాఠశాల ప్రహరీ

రహదారి వైపు కూలిన పాఠశాల ప్రహరీ

ప్రజాశక్తి - ఆరిలోవ :ఆరిలోవ, అంబేద్కర్ నగర్, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల రక్షణ గోడ శుక్రవారం సాయంత్రం ఒక్కసారి కుప్పకూలి పోయింది. ఆ సమయంలో అక్కడ ఎవ్వరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఇటీవల వరుస తుఫాన్లు, వర్షాలు పడడంతో బీటలు వారిన పాఠశాల రక్షణ గోడతో పాటు గేటు కూడా నానిపోయి శఒక్కసారి కూలిపోయింది. నిత్యం రద్దీగా ఉన్న రహదారి పక్కనే పాఠశాల ఉండడంతో అక్కడే చాలా మంది ప్రయాణికులు బస్సులు, ఆటోలు కోసం వేచి ఉంటారు. అయితే పాఠశాల పని వేళల్లో కాకుండా సాయంత్రం కూలడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు అంటున్నారు. తుఫానుల కారణంగా దెబ్బతిన్న పాఠశాలల భవనాలు, రక్షణ గోడలను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుకుంటున్నారు.

రెండో రోజుకు ముఠా కార్మికుల సమ్మె

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ

ప్రజాశక్తి-అనకాపల్లి

కూలి రేట్లు పెంచాలని కోరుతూ అనకాపల్లి ముఠా కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారం నాటికి రెండవ రోజుకు చేరింది. ఇందులో భాగంగా కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ పెరుగుతున్న ధరలతో పోల్చుకుంటే కార్మికులు చేసిన డిమాండ్ సహేతుకమైందని తెలిపారు. చాలీచాలని ఆదాయంతో కార్మికుల కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పొద్దస్తమానం పనిచేసినా కనీస కూలీ గిట్టుబాటు కాలేదని, పనులు లేక అనేకమంది హమాలీ పనిని వదులుకున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో యజమానులు వెంటనే పిలిచి చర్చలు చేయడానికి బదులు అందుకు భిన్నంగా యజమానులు ధర్నాలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తక్షణమే కూలి రేట్లు పెంపునకు సానుకూలంగా చర్చలు చేయాలని డిమాండ్ చేశారు. వీరి ఆందోళనకు మద్దతుగా ఆర్టీసీ అద్దె బస్సుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పలక సత్యనారాయణ, పి.వరమేశ్వరరావు తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమం ముఠా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్ష కార్యదర్శులు కాపుశెట్టి అప్పారావు, జి నర్సింగరావు, తిర్రి సురేష్, బీశెట్టి అప్పారావు, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

వర్తకులు, కార్మికుల మధ్య చర్చలు విఫలం

అనకాపల్లి : ముఠా కార్మికుల కూలీ రేట్లు విషయంపై శుక్రవారం కార్మిక శాఖ కార్యాలయంలో జరిగిన చర్చలు విఫలమయ్యాయి. ప్రస్తుతం ఇస్తున్న కూలి రేట్లకు 50శాతం పెంచాలని మొదట కోరిన కార్మికులు చర్చలు సందర్భంగా తగ్గి 35శాతం పెంచాలని కోరారు. వర్తక సంఘం ప్రతినిధులు 14శాతం మాత్రమే పెంచుతామని చెప్పడంతో చర్చలు విఫలమయ్యాయి. దీనితో కార్మిక శాఖ అధికారులు శనివారం నాలుగు గంటలకు చర్చలను వాయిదా వేయడం జరిగింది. కార్యక్రమంలో వర్తక సంఘం ప్రతినిధులు శ్రీధరాల సోమరాజు, బొడ్డేడ శంకర్రావు, బొడ్డేడ సత్తిబాబు, ముఠా కార్మిక ప్రతినిధులు సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకరరావు, గంటా శ్రీరామ్, బీశెట్టి అప్పారావు, కాపుశెట్టి అప్పారావు, తిర్రె సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదల

ప్రజాశక్తి-అనకాపల్లి : ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఉద్యోగాలకు ఉద్యోగ నోటిఫికేషన్‌లను విడుదల చేసినట్లు జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ యువతకు అగ్నివీర్ వాయు, మెడికల్ అసిస్టెంట్, ఫార్మసిస్ట్ ట్రేడ్‌లలో ఎయిర్మెన్ ఉద్యోగాలకు రిక్రూట్మెంటు అధికారి, కమాండింగు అధికారి గురుప్రీత్ అట్వాల్ ఉద్యోగ నోటిఫికేషన్లను విడుదల చేసినట్లు పేర్కొన్నారు. అగ్నివీర్ వాయు ఇంటెక్ 01/2026 కోసం ప్రవేశ నోటిఫికేషన్ వివరాలు agnipathvayu.cdac.in లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మెడికల్ అసిస్టెంట్, ఫార్మసిస్ట్ ట్రేడ్ లలో ఎయిర్మెన్ ఉద్యోగాలు ఓపెన్ రిక్రూట్మెంట్ ర్యాలీ ద్వారా ఎంపిక జరుగుతుందని, నోటిఫికేషన్ వివరాలు airmenselection.cdac.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఆసక్తిగల అభ్యర్థులు వెబ్ సైట్‌లో వివరాలు చూడవచ్చని, జిల్లా నుండి అధిక సంఖ్యలో యువత రిక్రూట్మెంట్ ర్యాలీలో పాల్గొనాలని ఆమె ఆకాంక్షించారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : జివిఎంసి అనకాపల్లి జోన్‌లో పని చేస్తున్న మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కారం చేయాలని శుక్రవారం జోనల్ కమిషనర్ బివి రమణకి మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షులు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ అదనంగా నియమించిన 15 మంది కార్మికులకు 8 నెలల నుంచి బకాయి జీతాలను వెంటనే ఇవ్వాలని, నెల నెల జీతాలు వచ్చే విధంగా చూడాలని, ఔట్ సోర్సింగ్ కార్మికులలో వీరిని కలపాలని కోరారు. క్లాప్ వెహికల్స్‌లో పనిచేస్తున్న లోడర్స్ 28 మందికి బకాయి పడ్డ నాలుగు నెలల జీతాలను వెంటనే ఇవ్వాలని, పిఎఫ్, ఈఎస్ఐ నిమిత్తం కార్మికుల వాటాలను కట్ చేస్తున్న కాంట్రాక్టర్ తన వాటాతో కలిపి ఆ ఖాతాలో వెంటనే జమ చేసే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మలేరియా డిపార్మెంట్‌లో తొలగించిన నలుగురు కార్మికులను వెంటనే విధుల్లో తీసుకోవాలన్నారు. అనకాపల్లి జోనల్ కార్యాలయంలో కొంతమంది అధికారులు కార్మికులకు రావలసిన వాటిని బిల్లు పెట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఇటువంటి వారిపై చర్యలు చేపట్టాలని లేదంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి యర్రంశెట్టి శివకుమార్, క్లాప్ డ్రైవర్ యూనియన్ నాయకులు జలగడుగుల శివకుమార్, నీలాపు లోకేష్, సింగంపల్లి నాగమణి, బంగారు సాయి, బొమ్మల పాలరావు, బండి చంటి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు పంపిణీ

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి రోటరీ క్లబ్‌లో గురువారం రాత్రి పాఠశాలలో చదువుకున్న విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు పంపిణీ చేశారు. ముందుగా విద్యార్థులు తమ మార్కులతో కూడిన అప్లికేషన్‌ని రోటరీ క్లబ్‌కి అందజేశారు. మార్కుల ఆధారంగా 80 మంది విద్యార్థులకు సుమారుగా లక్ష రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వాణిజ్య పన్నుల శాఖ అధిపతి ఎం ధనుష్ కుమార్ చేతుల మీదగా విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అనకాపల్లి రోటరీ క్లబ్ అధ్యక్షులు సరిపల్లి రాజేష్, కార్యదర్శి దేవత అనిల్, స్కాలర్షిప్ చైర్మన్ బిఎస్ గుప్తా, జిల్లా పబ్లిక్ ఇమేజ్ బుద్ద రమణాజీ, కొణతాల రామానాయుడు, ఆయన కుమారులు కెవిఆర్ నాయుడు, రోటరీ క్లబ్ సభ్యులు బుద్ద శ్రీనివాసరావు, సానా త్రినాథ్, డాక్టర్ శేష్ కుమార్, గౌరీపతి, కేఎల్ఎన్ కుమార్. కే సతీష్ పాల్గొన్నారు.

అయ్యన్న విద్యా సంస్థలు మరింత విస్తరించాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు : గ్రామీణ ప్రాంతంలో ఉత్తమ, ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకురావాలనే ఆశయంతో డాక్టర్ ఖాశీం స్థాపించిన అయ్యన్న విద్యా సంస్థలు భవిష్యత్‌లో మరింతగా విస్తరించాలని రాష్ట్ర వెలమ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పివిజి.కుమార్ ఆకాంక్షించారు. 'ఆలిండియా చిల్డ్రన్ ఆర్ట్ కాంపిటీషన్'లో అయ్యన్న స్కూల్ విద్యార్థులు 26 మంది మెడల్స్, ప్రశంసా పత్రాలను సాధించారు. ఆ పతకాలను, ప్రశంసా పత్రాలను శుక్రవారం డాక్టర్ ఖాశీం ఆధ్వర్యంలో పీవీజీ కుమార్ చేతుల మీదుగా విజేత విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఖాశీంను, చిత్ర లేఖనం పోటీలకు శిక్షణ ఇచ్చిన ప్రిన్సిపాల్ సుమతిని అభినందించారు. అనంతరం పీవీజీ కుమార్‌ను, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ రొంగలి మహేష్‌ను అయ్యన్న విద్యాసంస్థల తరఫున డాక్టర్ ఖాశీం తదితరులు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు కశిరెడ్డి అప్పలనాయుడు, నాయకులు కన్నూరు సూర్యనారాయణ, దొగ్గ దేముడునాయుడు పాల్గొన్నారు.

31 వరకు ఎస్‌సి కుల గణనపై సోషల్ ఆడిట్

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలో ఎస్సీ కుల గణనపై డిశంబరు 31వ తేదీ వరకు సోషల్ ఆడిట్ నిర్వహించడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విడుదల చేసిన జాబితాలో ఎస్సి జనాభా, వారి వివరాలు – పేరు, ఆధార్ నంబరు, పుట్టిన తేదీ, వయసు, ఉపకులం, మరుగుదొడ్డి సౌకర్యం, తాగునీటి సౌకర్యం, విద్యార్హత, వృత్తి, వ్యవసాయం, ఇతర వివరాలపై సోషల్ ఆడిట్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గురువారం నుంచి గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శన తదుపరి వివరాలపై డిసెంబర్ 31వ తేదీ వరకు అభ్యంతరాల స్వీకరణ జరుగుతోందని ఆమె పేర్కొన్నారు. అభ్యంతరాలపై 2025 జనవరి 6వ తేది లోగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, జనవరి 10న కులగణన తుది వివరాలు పొందుపరచిన తుది జాబితా విడుదల చేయడం జరుగుతోందని తెలిపారు. డేటాపై అభ్యంతరాలను వీఆర్వో స్వీకరిస్తారని, వీటిని మూడు దశల్లో తనిఖీ చేస్తారని వెల్లడించారు. పౌరుల నుంచి వచ్చిన అభ్యంతరాలను వీఆర్వో పరిశీలించి వివరాలను సంబంధిత రెవిన్యూ అధికారికి నివేదిస్తారని తెలిపారు. వీటిని పున:పరిశీలించి తహసీల్దారుకు సిఫారసు చేస్తారని, తహసీల్దారు, వీఆర్వో నివేదికలోని వివరాలు పరిశీలించి, తుది ఆమోదం తెలిపి ఆ వివరాల్ని పోర్టల్లో పొందుపరుస్తారని వివరించారు.

29న ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని పెద గొల్లలపాలెం గ్రామంలో ఈనెల 29న ఆదివారం ఉదయం 9 గంటల నుండి ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కుర్మన్నపాలెం లయన్స్ క్లబ్ సౌజన్యంతో ఈ ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరంలో బీపీ, షుగర్, జనరల్ ఫిజీషియన్, ఆర్థోపెడిక్, గైనకాలజిస్ట్, దంత వైద్యనిపుణులు పాల్గొని రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తారని తెలిపారు. పరిసర గ్రామాల ప్రజలు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వ్యవసాయ, విద్యా రుణాలు ఎక్కువగా అందించాలి

జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి

బ్యాంకులు వ్యవసాయ, విద్యా, ఉపాధి రంగాలకు లక్ష్యాలకు మించి రుణాలు అందించాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ పేర్కొన్నారు. కలెక్టరు కార్యాలయ సమావేశమందిరంలో నిర్వహించిన డిసిసి, డిఎల్ఆర్సి త్రైమాసిక సమావేశంలో ఆమె మాట్లాడుతూ కౌలు రైతులకు వ్యవసాయ రుణాలు అందించాలని, ఈ-క్రాప్ ఆధారంగా వ్యవసాయ రుణాలు మంజూరు చేయాలని, వ్యవసాయ అనుబంధ రంగాలకు రుణాలు ఇవ్వాలని కోరారు. ఉన్నత విద్యను అభ్యసించడానికి విద్యారుణాలు అందించాలని, కళాశాలల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, రుణమేళాలు నిర్వహించి రుణాలు మంజూరు చేయాలని సూచించారు. నిర్వర్థకఖాతాలలో గల డబ్బులను సంబంధికులను గుర్తించి అందజేయాలని కోరారు. తోటలు, కూరగాయలు, పశు సంవర్ధక, డైరీ, మత్స్య పరిశ్రమలలో కాలానుగుణంగా ఉత్పత్తి సాధించే రంగాలకు ఆర్థిక చేయూత నివ్వాలని సూచించారు. బ్యాంకులు, నైపుణ్యాభివృద్ధి సంస్థల ద్వారా అందిస్తున్న నైపుణ్యశిక్షణ ఫార్మా కంపెనీలలో ఉద్యోగాలకు అవసరమైన అంశాలలో అందించాలని కోరారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ యువతకు నైపుణ్య శిక్షణ అందించి స్వయం ఉపాధి పొందేలా రుణాలు అందించాలని కోరారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ రుణ ప్రణాళిక అమలు నివేదికను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం ఆర్‌బిఐ ఎజియం ఆర్‌కె.హనుమకుమారి వివిధ బ్యాంకుల ద్వారా అమలు చేస్తున్న రుణాలను సమీక్షించారు. ఈ సమావేశంలో యూనియన్ బ్యాంక్ డిప్యూటీ ప్రాంతీయ అధికారి పి.సన్యాసిరాజు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రోజెక్టు డెరెక్టరు కె.శచీదేవి, జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహనరావు, జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి బి.రామమోహనరావు, బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

4 రోజులు గ్రామీణ వికాస్ బ్యాంకు సేవలు నిలిపివేత

ప్రజాశక్తి- అనకాపల్లి : భారత ప్రభుత్వ ఆర్థిక సేవల విభాగం ఆదేశాల మేరకు ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు ఆంధ్రా, తెలంగాణ విభాగాల విభజన దృష్ట్యా ఈ నెల 28వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు బ్యాంకు సేవలను నిలిపివేస్తున్నట్లు ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ ఎస్.సతీష్ చంద్ర శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణలోని వరంగల్ కేంద్రంగా ఏపీజీవీబీ రెండు తెలుగు రాష్ట్రాల్లో పనిచేస్తుందని, బ్యాంకు కార్యకలాపాలను రెండు రాష్ట్రాల్లో విభజన జరుగుతుందని తెలిపారు. ఈనెల 28వతేదీ నుంచి 31వతేది వరకు బ్యాంకు సేవలతో పాటు ఏటీఎం కార్డులు, ఆన్లైన్ నగదు లావాదేవీలన్నీ నిలుపుదల చేస్తున్నామని పేర్కొన్నారు. 2025 జనవరి 1 నుండి బ్యాంకు సేవలు యథావిధిగా అందుబాటులోకి వస్తాయని, ఈ విషయాన్ని ఖాతాదారుల గమనించి, సహకరించాలని ఆయన కోరారు.

కుంగిన రోడ్డుకు మరమ్మతు చేయాలని సిపిఎం నిరసన

ప్రజాశక్తి-మునగపాక

అనకాపల్లి- అచ్యుతాపురం ప్రధాన రహదారిలోని మునగపాక చర్చి సమీపంలో కుంగిపోయిన రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం ఆ ప్రాంతంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వివి.శ్రీనివాసరావు, మండల నాయకులు ఎస్ బ్రహ్మాజీ మాట్లాడుతూ సిపిఎం, ఇతర ప్రజా సంఘాల పోరాట ఫలితంగా అచ్యుతాపురం నుండి అనకాపల్లి బైపాస్ వరకు గత ప్రభుత్వ హయాంలో వేసిన రోడ్డు ఆరు నెలల్లోనే కుంగిపోయిందని తెలిపారు. దీని వల్ల వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు వేసిన కాంట్రాక్టర్, జిల్లా అధికారి యంత్రాంగం నిర్లక్ష్యానికి ఇది నిదర్శనంగా ఉందన్నారు. నావెల్ బేస్, ఎస్ఈజెడ్‌లకు భారీ వాహనాలు వెళ్లడంతో ఈ రోడ్డు అధ్వానంగా తయారవుతుందని పేర్కొన్నారు. అనకాపల్లి నుంచి అచ్చుతాపురం వరకు పలుచోట్ల గుంతలమయంగా మారటంతో పాటుగా రోడ్ మార్గంలో ఉన్న పురాతన బ్రిడ్జిలు సైతం శిథిలమై కూలిపోయే దశలో ఉన్నాయని తెలిపారు. పరిమితికి మించి అధిక లోడుతో వెళుతున్న భారీ వాహనాలను దారి మళ్లించాలని డిమాండ్ చేశారు. ఇటీవల ఈ కుంగిన రోడ్డు వద్ద పలు వాహనాలు బోల్తా పడ్డాయని, రాత్రి సమయాల్లో ప్రమాదాల గురవుతున్నాయని, అయినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమని పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం, కాంట్రాక్టర్ వెంటనే స్పందించి కుంగిపోయిన, శిథిలమైన రోడ్డును వెంటనే మరమ్మతులు చేయాలని, లేకుంటే ప్రజలందరిని కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పెంటకోట సత్యనారాయణ, ఎస్.కాశీ విశ్వనాథం, ప్రసాదు, పలువురు వాహనదారులు పాల్గొన్నారు.

రహదారి కుంగుపోయిన ప్రాంతంలో నిరసన తెలుపుతున్న దృశ్యం

విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై రాష్ట్ర ప్రభుత్వ వైఖరి స్పష్టం చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు

ప్రజాశక్తి-అనకాపల్లి

విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై రాష్ట్ర ప్రభుత్వం వైఖరి స్పష్టం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రధానమంత్రి, ఆర్థిక, స్టీల్, రైల్వే మంత్రులను కలిసి రాష్ట్రాభివృద్ధికి సంబంధించి అనేక ప్రాజెక్టులు, సమస్యలు, నిధులపై చర్చించారని, ప్రధానమంత్రితో ప్రత్యేకంగా ఆర్సెలార్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు తక్షణం ముడి ఇనుప గనులు కేటాయించాలని, అన్ని అనుమతులు మంజూరు చేయాలని కోరారని తెలిపారు. కాని విశాఖ స్టీల్‌ప్లాంట్ సమస్య పరిష్కారానికి ప్రధానితో ఒక్కమాట కూడా మాట్లాడకపోవడాన్ని కోటేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరునెలలు దాటినా నేటికీ విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ముడి ఇనుప గనులు కేటాయింపు, సెయిల్‌లో విలీనం, 18వేల కోట్లు ప్యాకేజీ సమస్యను పరిష్కారం చేయకుండా కాలయాపన చేస్తుందని విమర్శించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ సమస్య పరిష్కరించకుండా ఆర్సెలార్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌పై దాసోహమవటం సిగ్గుచేటన్నారు. మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు భూమి కేటాయింపు, జిఎస్‌టి మినహాయింపు, విద్యుత్ రాయితీ, పెట్టుబడిసాయం, భూ బదలాయింపు ఫీజులు మినహాయింపు, మంచినీరు, రోడ్లు, రైల్వే లైన్స్ వంటి సదుపాయాలన్నీ కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సిద్ధమైందని పేర్కొన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి పన్నులు, విద్యుత్ రాయితీలు కల్పించకుండా ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాన్ని విస్మరించి కేంద్ర బిజెపి ప్రభుత్వ ప్రైవేటీకరణ కుట్రల్లో పాలుపంచుకొనే విధంగా వ్యవహరిస్తూ ఆంధ్ర ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై రాష్ట్ర ప్రభుత్వం తమ స్పష్టమైన వైఖరిని వెల్లడించాలని, లేకపోతే ముఖ్యంగా ఉత్తరాంధ్ర, ఆంధ్ర ప్రజల ఆగ్రహావేశాలకు గురికాకతప్పదని హెచ్చరించారు.

రక్తదాన శిబిరం విజయవంతానికి ర్యాలీ

ప్రజాశక్తి-చోడవరం : సిడిఎం ఫౌండేషన్, సద్భావ టీం ఆధ్వర్యంలో జనవరి 5వ తేదీన తలపెట్టిన జీవధార రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం చోడవరం పట్టణ వీధుల్లో పెద్ద ఎత్తున అవగాహన ర్యాలీ నిర్వహించారు. చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఉషోదయ, విద్యార్థి డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి విద్యార్థులు వాయిద్యాలతో పాల్గొన్నారు. ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేస్తూ రక్తదానం యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ ఈ శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు. రక్తదానం ద్వారా మరొకరికి ప్రాణదానం చేయాలన్న నినాదంతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఎస్సై ఈ ర్యాలీని ప్రారంభించగా ఆర్టీసీ కాంప్లెక్స్ బజార్ వీధి కొత్తూరు జంక్షన్ మీదుగా హార్డింగ్ రెస్ట్ హౌస్ వరకు సాగింది. 1000 మందితో రక్తదానం చేయాలని సంకల్పించామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కొప్పాక రాజేష్, సభ్యులు కొడమంచిలి చలపతి, పి.మల్లిక్, పసుమర్తి శ్రీనివాసరావు, గీత లక్ష్మి, ఉప్పల రజని, దేవరపల్లి కుమారి, పుట్టా శ్రీనివాసరావు, కరణం నరసింహమూర్తి, కొప్పాక భగవాన్, కళాశాల అధ్యాపకులు దాసరి మాల్యాద్రి, పిడి మూర్తి ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వం వేగంగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ మండలంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు వేగంగా పూర్తి చేయాలని ఎపి ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ కార్పొరేషన్ చైర్మన్, టిడిపి పెందుర్తి నియోజకవర్గం ఇంచార్జ్ గండి బాబ్జి పిలుపునిచ్చారు. పరవాడ మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయ పర్యవేక్షణకు శుక్రవారం వచ్చిన ఆయన కార్యకర్తలను, నాయకులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి పైల జగన్నాధరావు, మాజీ ఎంపిపి మాసవరపు అప్పలనాయుడు, మండల టిడిపి అధ్యక్షులు వియ్యపు చిన్న, కన్నూరు వెంకటరమణ, గొర్లి కనకారావు, ఇందల కొండలరావు, ఓమ్మి వెంకటరావు, సూరాడ బంగార్రాజు, సారిపల్లి జోగినాయుడు, బొడ్డపల్లి అప్పారావు, రాయవరపు దేవుడు, యాసరపు కనకారావు, వర్రి వసంత రావు, పైలా రామచంద్ర రావు, మచ్చా శివకుమార్, గొర్లి సామినాయుడు, గొర్లి రామారావు, షేక్ మదీనా, పైలా ముత్యాలనాయుడు, మొల్లి బాలాజీ పాల్గొన్నారు.

పాఠశాల ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని వాలాబు పంచాయతీ శివారు పాతవాలాబు ఎంపిపి స్కూల్ ప్రహరీ గోడ నిర్మాణానికి 15 లక్షల రూపాయలు నిధులు మంజూరైనట్లు స్థానిక సర్పంచ్ పోతల వెంకటలక్ష్మి, బుజ్జి తెలిపారు. స్కూల్ ప్రధానోపాధ్యాయులు డి.నాయుడు, ఇంజనీర్ డిపార్ట్మెంట్ ఏఈతో కలిసి శుక్రవారం పాఠశాల ఆవరణాన్ని ఆమె పరిశీలించారు. ఏఈ సమక్షంలో కొలతలు తీసుకుని ఎస్టిమేట్ వేసినట్లు సర్పంచ్ తెలిపారు. పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు మంజూరుపై ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే ఈ పనులు ప్రారంభించాలని ఏఈ స్థానిక ప్రధానోపాధ్యాయుడికి సూచించారు.

సుగర్ ఫ్యాక్టరీ కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి-చోడవరం : తమ సమస్యలను పరిష్కరించే వరకు ఫ్యాక్టరీలో విధులను బహిష్కరిస్తున్నామని గోవాడ చక్కెర కర్మాగారం కార్మికులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు భాస్కరరావు మాట్లాడుతూ ఏడాది కాలం నుండి కార్మికులకు అందవలసిన బెనిఫిట్స్ ఏమి అందలేదన్నారు. యాజమాన్యం నిరంకుశ వైఖరి వల్ల కార్మికులు, రైతులు నష్టపోవడంతో పాటు ఏడాదికి ఏడాది ఫ్యాక్టరీ గానుగాట తగ్గుతూ వస్తుందని తెలిపారు. కార్మికుల సమస్యలు పరిష్కరించి క్రషింగ్ ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తుంపాల వెంకటరమణ, నక్కా శ్రీనివాస్ బాబు శుక్రవారం అనకాపల్లి జిల్లా విద్యాశాఖధికారి గిడ్డి అప్పారావు నాయుడుని కలిసి ఉపాధ్యాయ సమస్యలపై విన్నవించారు. కేజీబీవీ ఉపాధ్యాయులు డిసెంబర్ నెలలో అకాడమిక్ క్యాలెండరు ప్రకారం మిగిలి ఉన్న క్యాజువల్ సెలవులను వాడుకునే విషయంలో 3 సెలవులకు మించకుండా వాడకూడదనే అనకాపల్లి ఎస్ఎస్ఎ అధికారుల నిబంధనలపై చర్చించారు. డీఈవో సానుకూలంగా స్పందిస్తూ అనారోగ్యం కారణంగా మిగిలిన సెలవులను పూర్తిగా వాడుకోవచ్చన్నారు. మూడు సెలవులే వాడాలనే నిబంధన లేదని క్లారిటీ ఇచ్చారు. కేజీబీవీ టీచర్స్‌కు వేతనంతో కూడిన మెడికల్ లీవ్స్ లేనందున వారికున్న సిఎల్ఎస్‌ను వారి అవసరం మేరకు డిసెంబర్ నెలలో వాడుకోవచ్చని చెప్పారు.

తుపాన్‌లో నష్టపోయిన రైతులందరికీ నష్టపరిహారం ఇవ్వాలి

వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నేతలు

ప్రజాశక్తి-అనకాపల్లి

తుపాన్‌లో నష్టపోయిన రైతులందరికీ నష్టపరిహారం ఇవ్వాలని ఎపి రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వసంత కుమారిని శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, కోశాధికారి జి.నాయనబాబు, సహాయ కార్యదర్శి ఎస్.వి.నాయుడు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న, కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కె.సదాశివరావు మాట్లాడుతూ జిల్లాలో అచ్యుతాపురం, రాంబిల్లి, చోడవరం, నక్కపల్లి, ఎస్ రాయవరం మండలాల్లో వర్షానికి దెబ్బతిన్న వరి పొలాలను తాము పరిశీలించామని చెప్పారు. వర్షాలకు ముందు కోసిన వరి ధాన్యం తడిసిపోవడతో మొక్కలు వచ్చి పనికి రాకుండా పోయాయని తెలిపారు. వర్షాలు సందర్భంగా మడుల్లో కుప్పలు వేయగా, ధాన్యం ముక్కిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. చేతికి అందివచ్చిన పంట కళ్లముందే పాడైపోతుండడంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఎకరాకు రూ.50వేలు నష్టపరిహారం ఇవ్వాలని, తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని క్వింటా ధాన్యానికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.2320కు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.500లు కలిపి ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పెట్టుబడి సాయం రూ.20వేలు వెంటనే చెల్లించాలని కోరారు.

గొర్రెల మందపై కుక్కల దాడి

15 మృత్యువాత - మరికొన్నింటి ఆచూకీ లభించని వైనం

ప్రజాశక్తి-రాంబిల్లి : మండల కేంద్రం రాంబిల్లిలోని రాజుగారి కొబ్బరి తోటలో గొర్రెల మందపై కుక్కలు దాడి చేశాయి. దీంతో 15 గొర్రెలు మృత్యువాత చెందగా, మరికొన్నింటి ఆచూకీ లభ్యం కాలేదు. దీనికి సంబంధించి బాధిత రైతు తెలిపిన వివరాలు ప్రకారం... మండలంలోని గోవింద పాలెం గ్రామానికి చెందిన ఇసరపు రమణ అనే గొర్రెల పెంపకందారుడు తమ గొర్రెల మందను రాంబిల్లి రాజు గారి కొబ్బరి తోటలో చుట్టూ ఇనుప కంచె వేసి ఉంచాడు. ఎవరు లేని సమయం కుక్కలు కంచెలో నుండి లోపలకు ప్రవేశించి పెద్ద గొర్రెలు పిల్లలు కలిపి 15 గొర్రెలపై దాడి చేయడంతో అవి మృతి చెందాయి. కుక్కల దాడితో మిగతా గొర్రెలు మందను వెళ్లిపోగా, వాటి ఆచూకీ తెలియలేదని బాధిత పెంపకందారుడు రమణ వాపోయాడు. విషయం తెలుసుకున్న గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా డైరెక్టర్ జి దేవుడు నాయుడు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. బాధిత పెంపకందారుడిని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులు, జిల్లా ఉన్నతాధికారులు ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వై.రాము పాల్గొన్నారు.

రైవాడ రిజర్వాయర్‌ను పరిశీలించిన పోతల

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని రైవాడ రిజర్వాయర్‌ను ఆ ప్రాజెక్ట్ చైర్మన్ పోతల పాత్రునాయుడు శుక్రవారం పరిశీలించారు. నూతనంగా ప్రాజెక్టు చైర్మన్‌గా నియమితులైన తర్వాత మొదటిసారిగా జలాశయం డిఈ ఆర్. సత్యం నాయుడుతో కలిసి జలాశయాన్ని పరిశీలించారు. జలాశయం ఎడమ, కుడి కాలువ ఇంటెక్ చాంబర్స్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. లీకేజ్ అయిన పలుచోట్ల ఇసుక బస్తాలను వేయించారు. ప్రస్తుతం జలాశయం నీటిమట్టం వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జలాశయం ఏఈలు నందకిషోర్, నాగేంద్ర ఉన్నారు.

శరవేగంగా సిసి రోడ్డు నిర్మాణం

రోడ్డు నిర్మాణం పరిశీలిస్తున్న సర్పంచ్, ఎంపిటిసి

ప్రజాశక్తి-చోడవరంరూరల్

చోడవరం మండలం వెంకన్నపాలెం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గత 20 సంవత్సరాలుగా పరిష్కారం కాని రోడ్డు సమస్యను సర్పంచ్ మొల్లి ఈశ్వరరావు, ఎంపిటిసి మురిగితి రమణ చొరవతో పరిష్కారమవుతోంది. ఈ రోడ్డు నిర్మాణానికి కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం సర్పంచ్ మొల్లి ఈశ్వరరావు, ఎంపిటిసి మురిగితి రమణ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతి కార్యదర్శి గంగాధర్, సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్ వాసు, వార్డు మెంబర్ నంబారు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ నిధులు దుర్వినియోగంపై విచారణ

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని ముత్యాలమ్మ పాలెం గ్రామ పంచాయితీలో ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చెందాయని గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకులు అర్జిల్లి అప్పలరాజు స్పందనలో జిల్లా కలెక్టర్ చేసిన ఫిర్యాదుపై శుక్రవారం పరవాడ ఎంపీడీవో బృందం విచారణ చేపట్టారు. సిసి రోడ్ల నిర్మాణం కొరకు ఎన్ఆర్ఇజిఎస్, సిఎఎఫ్‌వి ద్వారా రూ.70.60 లక్షలు ప్రభుత్వం మంజూరు చేయగా, టీడీపీ నాయకులు చింతకాయల ముత్యాలు తన సొంత లేఅవుట్‌లో రోడ్డును నిర్మించారని, ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేసిన చింతకాయల ముత్యాలుపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని అప్పలరాజు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. శుక్రవారం పరవాడ ఎంపీడీవో, ఈవోపీఆర్డీ ముత్యాలమ్మ పాలెం గ్రామ పంచాయితీ కార్యదర్శి గ్రామ సచివాలయంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా సంబంధిత వివరాలు, ఆధారాలను అధికారులకు అప్పలరాజు చూపించారు. దీనిపై సమగ్ర విచారణ చేసి న్యాయం చేస్తామని, తప్పు చేసిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని, విచారణ అధికారి ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో బొంది దుర్గారావు, సిహెచ్ ముత్యాలు, సూరాడ మహేష్, ఎస్ అమ్మోరయ్య, టి రాజు, మహేంద్రా, కూటమి నాయకులు వాసుపల్లి సోము శేఖర్, మూస రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని కలపాక గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా పరవాడ డిప్యూటీ తహసీల్దార్ సురేష్ నాయుడు మాట్లాడుతూ భూ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలకు 45రోజుల్లో పరిష్కారం చేస్తామని తెలిపారు. ఈ సదస్సులో సౌకత్ ఆలీ అనే రైతు కలపాక రెవిన్యూ సర్వే నెంబర్ 93-2లో ఉన్న భూమిని జగనన్న రీ-సర్వేలో తన అన్నయ్య మహమ్మద్ రంజాన్ ఆలీ పేరుతో ఖాతా నెంబర్ 953తో నమోదు చేశారని, దీనిపై రీ-సర్వే అభ్యంతరాలు, గ్రామ సభలో అర్జీ సమర్పించామని, అయినా అధికారులు సమస్యను పరిష్కరించలేదని డిప్యూటీ తహసీల్దార్ సురేష్ నాయుడుకు అర్జీ సమర్పించారు. కార్యక్రమంలో జనసేన మండల ఇన్చార్జి పంచకర్ల ప్రసాద్, నాయకులు బిగిడి రామ గోవిందరావు, తహశీల్దారు అంబేద్కర్, సబ్ రిజిస్ట్రార్, మండల సర్వేయర్ శ్రీనివాసరావు, వీఆర్ఓ నారాయణమ్మ పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని గొల్లలపాలెం, విప్పాక అగ్రహారం గ్రామాలలో శుక్రవారం రెవెన్యూ సదస్సులు జరిగాయి. ఈ గ్రామాల్లో భూ సమస్యలపై 8 అర్జీలు అందినట్లు తహశీల్దార్ బి.చిన్నకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో బోండా అప్పలరాజు, గొల్లవిల్లి రమణ, దాసరి కనకరాజు, మోపాడ దేవానంద్, వంగలపూడి సంతోష్ బాబు, ఆర్ఐ వీరయ్య, మండల సర్వేయర్ ఎల్.అప్పారావు, వెలుగు సర్వేయర్ రాంబాబు, వీఆర్వోలు టి.శేఖర్ రావు, దేముడుబాబు, విలేజ్ సర్వేయర్ దినేష్, పాల్గొన్నారు.

రావికమతం : మండలంలోని మేడివాడ మేజర్ పంచాయతీలో రెవెన్యూ సదస్సుకి మూడు దరఖాస్తులు అందాయి. మేడివాడ సచివాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో హెచ్ డి టి, మండల సర్వేయర్, వీఆర్వో సదస్సు నిర్వహించారు. ఆధార్, తండ్రి పేరు ఉన్న ల్యాండ్ కొడుకు పేరుకు మార్పు, నేమ్ కరెక్షన్ మొదలగు మూడు దరఖాస్తులు మాత్రమే అందాయని వీఆర్ఓ సాంబ తెలిపారు.

కోటవురట్ల : అన్నవరం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 20 ఫిర్యాదులు అందినట్లు తహసీల్దారు తిరుమల బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ శ్రీనివాసు పాల్గొన్నారు.

రోలుగుంట : రైతులు భూసమస్యలు ఉంటే ఫిర్యాదు చేయాలని తహశీల్దార్ సిహెచ్.నాగమ్మ అన్నారు. శుక్రవారం మండలంలోని బీబీ.పట్నం గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి మాట్లాడారు. సదస్సులో కేవలం మూడు మాత్రమే దరఖాస్తులు వచ్చాయి.

ఘనంగా సిపిఐ ఆవిర్భావ ఉత్సవాలు

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని నాగులపల్లి గ్రామంలో సిపిఐ శత వార్షికోత్సవ సంబరాలు సిపిఐ సీనియర్ నాయకులు నాయుడు మల్లికార్జునరావు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో దొక్కా పరదేశి, ముప్పిడి గోవిందా, ముప్పిడి గాంధీ, దొక్కా సూరప్పారావు, దొక్కా కామరాజు, లక్ష్మి, సత్యనారాయణ, ముప్పిడి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భారాలపై వైసిపి నిరసనలు

సీతమ్మధారలో వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎంపీ గొల్ల బాబూరావు, మాజీ మంత్రి అమర్‌నాథ్ తదితరులు

ప్రజాశక్తి -నక్కపల్లి: విద్యుత్ ఛార్జీల పెంపుపై మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు వైసీపీ పాయకరావుపేట నియోజకవర్గ ఇన్చార్జ్, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు ఆధ్వర్యంలో శుక్రవారం ఆ పార్టీ శ్రేణులు పాయకరావుపేటలో పోరుబాట నిరసన కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్ చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ శాఖ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేసారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు చిక్కాల రామారావు, శీరం నరసింహమూర్తి, బొలిశెట్టి గోవింద్, కిల్లాడ శ్రీనివాసరావు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మాడుగుల: పెంచిన విద్యుత్ ఛార్జీలు ఉపసంహరించుకోవాలని మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు డిమాండ్ చేశారు. విద్యుత్ ఛార్జీలపై పోరుబాట కార్యక్రమాన్ని స్థానిక సబ్ స్టేషన్ వద్ద భారీ ఎత్తున ఆందోళన నిర్వహించారు.అనంతరం విద్యుత్ శాఖ ఏఈకి వినత పత్రం అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం కల్లబొల్లి మాటలు చెప్పి విపరీతమైన హామీలతో అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడవకముందే 15 వేల కోట్లు పైచిలుకు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై ఆర్థిక భారాన్ని మోపుతుందని మండిపడ్డారు. పెరిగిన విద్యుత్ చార్జీలతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారని అన్నారు. ఎస్సీ ఎస్టీలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో పార్టీలకు అతీతంగా ఇల్లు మంజూరు చేసి జగనన్న కాలనీలకు ఉచిత విద్యుత్ మీటర్లు ఇస్తే, కూటమి ప్రభుత్వం ప్రతి లబ్ధిదారుల నుండి 3 వేలు రూపాయలు చొప్పున వసూలు చేస్తూ సొమ్ము చేసుకుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజారాం, జడ్పిటిసి కిముడు దేవుడమ్మ, సర్పంచ్ ఎడ్ల కళావతి, బొమ్మిశెట్టి శ్రీనివాస్, జవ్వాది వరహాలు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్ : విద్యుత్ చార్జీల పెంపుపై నర్సీపట్నంలో మాజీ శాసనసభ్యులు పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆధ్వర్యంలో వైసీపీ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ఏపీ ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం ముందు ప్ల కార్డులతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వాన్ని గెలిపిస్తే ఐదు సంవత్సరాలలో విద్యుత్ ఛార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే 15000 కోట్ల విద్యుత్ భారాన్ని మోపారని విమర్శించారు.అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా ఇంకా జగన్ వల్లే కరెంటు చార్జీలు పెరగడానికి కారణమని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ముందుగా మాజీ శాసనసభ్యులు పెట్ల ఉమా శంకర్ గణేష్ క్యాంపు కార్యాలయం నుంచి విద్యుత్ ఆఫీస్ వరకు ర్యాలీ చేపట్టారు.

అనకాపల్లి: కూటమి ప్రభుత్వం కరెంటు చార్జీల బాదుడుపై వైసిపి అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయం నుంచి విద్యుత్ శాఖ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించి, అనంతరం ధర్నా నిర్వహించారు. విద్యుత్ కార్యాలయ ఏఈ పద్మావతికి వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఎంపీపీలు గొర్లి సూరిబాబు, కలగా లక్ష్మి గున్నయ్య నాయుడు, జడ్పీటీసీ శ్రీధర్ రాజు, వైసిపి నాయకులు దంతులూరి దిలీప్ కుమార్, మందపాటి జానకిరామరాజు, జాజుల రమేష్, మలసాల కిషోర్, మళ్ల బుల్లిబాబు, కెఎం.నాయుడు, కోరుకొండ రాఘవ, పెద్దిశెట్టి గోవింద్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

మునగపాక : పెంచిన విద్యుత్ చార్జీలు తక్షణమే తగ్గించాలని కోరుతూ వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ ఆధ్వర్యాన స్థానిక విద్యుత్ సెక్షన్ ఆఫీసు వద్ద శుక్రవారం ధర్నా చేపట్టారు. విద్యుత్ చార్జీలు తగ్గించాలని నినాదాలు చేశారు. అనంతరం సెక్షన్ ఆఫీస్ ఏఈ గోపికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచులు దిమ్మల అప్పారావు, భీశెట్టి గంగ అప్పలనాయుడు, బొడ్డేడ శ్రీనివాసరావు, వైసీపీ నాయకులు మళ్ల సంజీవరావు, దాసరి అప్పారావు, కాండ్రేగుల జగన్, దొడ్డి వరహా, మళ్ల కృష్ణ, ఆడారి కాశిబాబు, నరాల శెట్టి సూర్యనారాయణ, రాజాన బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

మాడుగులలో..

సీతమ్మధార : విద్యుత్ ఛార్జీల పెంపునకు నిరసనగా జగన్ పిలుపుమేరకు వైసిపి పోరుబాటలో భాగంగా విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె రాజు ఆధ్వర్యంలో గురుద్వార్ జంక్షన్ నుంచి ఇపిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించి, వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్నాథ్, రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు, నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎమ్మెల్సీలు, వరుదు కళ్యాణి, రవీంద్రబాబు, మాజీఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు, డిప్యూటీ మేయర్లు, మాజీ ఛైర్మన్లు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

తగరపువలస : కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ వైసిపి పోరుబాటలో భాగంగా స్థానిక వై జంక్షన్ వద్ద ఆందోళన చేశారు. చిట్టివలస సబ్‌స్టేషన్‌కు ర్యాలీగా వెళ్లి ఎఇకి వినతిపత్రం అందజేశారు. జివిఎంసి 1 నుంచి 4 వార్డులు, భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల వైసిపి శ్రేణులు, 4వ వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండ బాబు, వైస్ ఎంపిపి బోని బంగారునాయుడు, నాయకులు గాడు శ్రీను, బంక సత్యం, ఎస్ కరుణాకర రెడ్డి, అల్లిపిల్లి నరసింగరావు, ఎస్ గిరిబాబు పాల్గొన్నారు

విశాఖ కలెక్టరేట్ : విశాఖలోని జగదాంబ జంక్షన్ నుంచి గ్రీన్ పార్క్ హోటల్ జంక్షన్‌లోని ఇపిడిసిఎల్ ఎస్ఇ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. లాంతర్లు, తలపై బల్బులు పెట్టుకుని వినూత్నంగా నిరసన తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, వైసిపి దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్, క్రిస్టియన్ మైనారిటీ మాజీ చైర్మన్ జాన్ వెస్లీ, వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీ, నాయకులు మూగి శ్రీనివాసరావు, కార్పొరేటర్లు కోడిగుడ్ల పూర్ణిమ, కోడిగుడ్ల శ్రీధర్, తోట పద్మావతి, చెన్నా జానకిరామ్, బిపిన్ కుమార్ జైన్, సలీం, నీలపు సర్వేశ్వర్ రెడ్డి, పీతల వాసు పాల్గొన్నారు.

అనకాపల్లిలో...

నర్సీపట్నంలో...

మాట్లాడుతున్న ఎంపీడీవో సీతారామరాజు

సచివాలయ సిబ్బందికి బయోమెట్రిక్ తప్పనిసరి

ప్రజాశక్తి- నక్కపల్లి: సచివాలయ సిబ్బందికి బయో మెట్రిక్ హాజరు తప్పనిసరని ఎంపీడీవో డి సీతారామరాజు అన్నారు. మండలంలోని ఉద్దండపురం లో సచివాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. సచివాలయ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి పలు అంశాలపై రివ్యూ నిర్వహించారు. సచివాలయంలో ప్రజలకు అందిస్తున్న సేవల పై ఆరా తీశారు. ఈ సర్వీసెస్ జరుగు తీరును పరిశీలించారు. ఈ సర్వీసెస్ అమౌంట్ ఎప్పటికప్పుడు జమ చేయాలన్నారు. ఎంఎస్ఎం ఈ సర్వే, మిస్సింగ్ సిటిజన్స్ డీటెయిల్స్ అప్లోడ్ చేయాలని సూచించారు. పిఎసిఎస్ ఖాతా రైతులకు ఈ కెవైసీ నమోదు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. వర్మీ కంపోస్టు అందుబాటులోకి రాగానే, రైతులకు విక్రయాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కుల గణనపై సామాజిక సర్వే

తహశీల్దార్ నరసింహమూర్తి

ప్రజాశక్తి -నక్కపల్లి: కుల గణనపై సామాజిక సర్వే సోషల్ (ఆడిట్) పారదర్శకంగా చేపడుతున్నామని తహసిల్దార్ నరసింహమూర్తి తెలిపారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని షెడ్యూల్ కులాల సామాజిక, ఆర్థిక అభివృద్ధి అంశాలపై సమీక్ష చేసేందుకు, పథకాలు అమలు, మెరుగైన పాలసీ రూపకల్పన చేసేందుకుగాను సర్వే చేపడుతున్నామన్నారు. గ్రామ సచివాలయాల్లో కుల గణనకు సంబంధించి సోషల్ ఆడిట్ జరుగుతుందని, ఇందుకు సంబంధించిన డేటాను సచివాలయాల్లో ప్రదర్శించడం జరిగిందన్నారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 31వ తేదీ వరకు స్వీకరణ చేపడతామని తెలియజేశారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సర్వే చేపట్టి తుది జాబితాను జనవరి 10వ తేదీన ప్రదర్శిస్తామని వెల్లడించారు. సోషల్ ఆడిట్ పై ఇప్పటికే గ్రామాల్లో ప్రజలకు దండోరా ద్వారా తెలియజేయడం జరిగిందన్నారు.

పరీక్షలు చేస్తున్న వైద్యులు

రాజయ్యపేటలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో ముసలమ్మ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జనసేన పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పిక్కి కోదండరావు (బుజ్జి), కూటమి నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో పాయకరావుపేట జనసేన పార్టీ ఇన్చార్జి గెడ్డం బుజ్జి, పార్టీ మండల శాఖ అధ్యక్షులు వెలగా సుధాకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. హెచ్‌సిజి క్యాన్సర్ హాస్పిటల్, మెడికవర్ ఆసుపత్రి వైద్యులు పరీక్షలు చేసి రోగులకు మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

29న మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్ : స్థానిక ఐదు రోడ్ల జంక్షన్ వద్ద ఈనెల 29న జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో మెగా కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు పిఆర్‌టియు అధ్యక్షులు డి.గోపీ నాథ్ తెలిపారు. కేర్ హాస్పిటల్ సౌజన్యంతో జనరల్ ఫిజీషియన్ డాక్టర్ అట్టాడ పృధ్వీరాజ్, డాక్టర్ రఘులు పరీక్షలు చేయడం జరుగుతుందని చెప్పారు. శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో కంటి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ వైద్య శిబిరాన్ని ఉపాధ్యాయులు వినియోగించుకోవాలన్నారు. వైద్య శిబిరం పోస్టర్లు విడుదల చేశారు.

గంజాయి అక్రమ రవాణాను అరికట్టాలి

పోలీస్ స్టేషన్‌లను తనిఖీ చేసిన డిఎస్‌పిలు

నర్సీపట్నం స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న డిఎస్‌పి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నం టౌన్ పోలీస్ స్టేషన్‌లో డి.ఎస్.పి జిఆర్ఆర్ మోహన్ వార్షిక తనిఖీ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేసు ఫైళ్ళు, స్టేషన్ రికార్డులు పరిశీలించారు. పోలీసులు పనితీరు మెరుగు పరచడంపై పలు సూచనలు అందించారు. గంజాయి అక్రమ రవాణాను అడ్డుకోవాలన్నారు. శాంతి భద్రతలపై దిశానిర్దేశాలు ఇచ్చారు. దొంగతనాలు జరగకుండా రాత్రిపూట పెట్రోలింగ్ చేయాలన్నారు. సైబర్ నేరాల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిఐ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

రావికమతం : గంజాయి అక్రమ రవాణా నియంత్రణకు ఎప్పటికప్పుడు ఆకస్మిక తనిఖీలు నిర్వహించడంతో పాటు ప్రజల్లో అవగాహన కల్పించాలని అనకాపల్లి సబ్ డివిజన్ డిఎస్పీ ఎం. శ్రావణి సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఆమె రావికమతం, కొత్తకోట పోలీస్ స్టేషన్లు సందర్శించారు. వివిధ కేసులలో పట్టుబడిన వాహనాలను పరిశీలించారు. పాత కేసులు పురోగతి అడిగి తెలుసుకొని దర్యాప్తు వేగవంతం చేయాలని, సీఐ, ఎస్సై లకు ఆదేశించారు. మాదక ద్రవ్యాల నియంత్రణ కు సంకల్పం కార్యక్రమం ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించేలా అవగాహన కల్పించాలన్నారు. వ్యాపార సంస్థల వద్ద వ్యాపారుల సహకారం తో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

ఉపాధి హామీ పనులు కల్పించాలి

-కంచాలు పట్టుకొని పలు గ్రామాల గిరిజనుల నిరసన

ప్రజాశక్తి-కొత్తకోట:రావికమతం మండలం చీమలపాడు పంచాయతీ కొండశిఖరం ఆదివాసి గిరిజన గ్రామాలైన జీలుగుల్లోవ, సోంపురం బంధ, నేరేడుబంధ గ్రామాలలో పివిటిజి గిరిజనులకు ఉపాధి హామీ పథకం పనులు కల్పించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం పలువురు గిరిజనులు కంచాలతో నిరసన చేశారు. ఈ సందర్భంగా గిరిజనులు కొర్రా బాలరాజు, గౌరీ తదితరులు మాట్లాడుతూ, నాలుగు గ్రామాలలో సుమారు 28 కుటుంబాలు నివసిస్తున్నామన్నారు. తమ కు జాబ్ కార్డులు ఉన్నప్పటికీ ఉపాధి పనులు చూపడం లేదని, దీంతో ఫారెస్ట్ పట్టా భూములలో జీడి మామిడి తోటలపై ఆధారపడి జీవిస్తున్నామన్నారు. గత ఏడాది కాలంగా ఉపాధి పనులు లేక. విజయవాడ, తిరుపతి వంటి ప్రాంతాల్లో. కూలి పనులకు వలస వెళుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఉపాధి పనులు కల్పించాలని అధికారులకి విన్నవించినా పరిష్కారం చూపడం లేదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు. ఉపాధి హామీ పథకంలో పనులు కల్పిస్తామంటూ పత్రికలో ప్రకటన గుప్పిస్తున్నాయని ఆరోపించారు. తాము కొండ శిఖరం పై నివాసం ఉండటంతో ఉపాధి పనులకు నోచుకోలేదన్నారు. ఈ కారణంగా జాబ్ కార్డులు రద్దయ్యే ప్రమాదం ఉందన్నారు.ఇప్పటికైనా ఉపాధి హామీ పథకం పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. లేదంటే జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు.

నినాదాలు చేస్తున్న గిరిజనులు

అల్లూరి స్మారక ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళిక

ప్రజాశక్తి-గొలుగొండ:స్వతంత్ర సమరయోధులు అల్లూరి సీతారామరాజు నడయాడిన అన్ని స్మారక ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు కేంద్ర ట్రైబల్ కల్చర్ జాయింట్ సెక్రెటరీ ఉమానందూరి అన్నారు. శుక్రవారం కృష్ణదేవిపేట అల్లూరి పార్కును సందర్శించి పార్కులో గల అల్లూరి, గంటం దొర సమాధులను సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ.. అల్లూరి నడియాడిన మంప, రాజేంద్రపాలెం, కృష్ణదేవిపేట ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ సంఘం రెండు తెలుగు రాష్ట్రాల కార్యదర్శి నడింపల్లి శ్రీనురాజు, రాష్ట్ర అధ్యక్షుడు పి.రఘు, మాజీ ఎమ్మెల్సీ డివిఎస్ఎన్.రాజు, రాజాసాగి చంటి, రాధాకృష్ణరాజు, దంతులూరి సుబ్రహ్మణ్యం రాజు, మాజీ జెడ్పిటిసి చిటికెల తారక వేణుగోపాల్, కొయ్యూరు తహశీల్దార్ ఎస్ఎల్వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళాను వినియోగించుకోవాలి

-హోం మంత్రి అనిత

ప్రజాశక్తి -నక్కపల్లి:పాయకరావుపేట శ్రీ ప్రకాష్ స్పేసెస్ డిగ్రీ కాలేజీలో ఈనెల 28 శనివారం నిర్వహించనున్న మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగపరచుకోవాలని హెూంమంత్రి అనిత పిలుపునిచ్చారు. ఏపీలో నిరుద్యోగ యువతకు 20 లక్షల ఉద్యోగాలందించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలోని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఉదయం 9గంటలకు ప్రారంభమయ్యే మెగా జాబ్ మేళాలో ఐటీ, ఫార్మా, ఆటోమొబైల్ రంగాలకు చెందిన ప్రముఖ సంస్థలు పాల్గొంటున్నట్లు తెలిపారు.యువతకు 1000కి పైగా ఉద్యోగావకాశాలు కల్పించేందుకు టాప్-50 కంపెనీలు తరలి వస్తున్నాయన్నారు.పదో తరగతి నుంచి పీజీ వరకూ ఏ అర్హత ఉన్నా ఈ మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వెంకన్నను ఊరేగిస్తున్న భక్తులు

ఉపమాకలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-నక్కపల్లి:ప్రాచీన పుణ్యక్షేత్రమైన ఉపమాక ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆలయ అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు, కృష్ణమాచార్యులు, శేషాచార్యులు గోపాలాచార్యుల ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుని ఉత్సవమూర్తులను పల్లకీలో తిరువీధి సేవ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-పాడేరు:జిల్లా కేంద్రం పాడేరులో స్థానిక కాఫీ హౌస్‌లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు ఏఎస్ దినేష్ కుమార్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే అనేకమంది దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేస్తున్నారన్నారు. గత ఆరు నెలలుగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పాలకవర్గం లేనందున కార్యక్రమాలు కొంత కుంటుపడిందని సభ్యుల వినతి మేరకు వెంటనే సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు.నూతన కార్యవర్గం ద్వారా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పాడేరు, చింతూరు, రంపచోడవరం ఐటిడిఏ ప్రాంతాలలో రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వ నమోదు డ్రైవ్ ఉంటుందన్నారు. ప్రత్యేక డ్రైవ్‌తో సభ్యత్వ నమోదు వేగవంతం చేస్తున్నామన్నారు.

ఆలయానికి రూ. 10 వేల విరాళం

ప్రజాశక్తి -మాడుగుల: మండలంలోని ఎం.కోడూరు. మోదకొండమ్మ అమ్మవారి పాదాల నిర్మాణం నిమిత్తం అదే గ్రామానికి చెందిన కీర్తిశేషులు ఎన్నేటి రమణమ్మ జ్ఞాపకార్థం భర్త కొండలరావు, కుమార్తెలు పుణ్యవతి, సునీత లు 10 వేలు రూపాయలు నగదు విరాళాన్ని ఆలయ కమిటీ చైర్మన్, గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావుకు శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పడాల అప్పలనాయుడు, ముమ్మిన రవణ బాబు, జాజిమొగ్గలు చిరంజీవి, చింత వెంకటనారాయణ మూర్తి, పడాల అప్పల నరసయ్య, కలిమగోపాల్,పోతిన జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

విద్యార్థులకు రక్త పరీక్షలు

ప్రజాశక్తి-రోలుగుంట:రోలుగుంట మండలం బుచ్చంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సునీత ఆధ్వర్యంలో గ్రామంలో గల ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు రక్తపరీక్షలు నిర్వహించారు. ఆర్‌బిఎస్‌కె కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు రక్తహీనత లేకుండా ముందస్తు చర్యల్లో భాగంగా రక్త పరీక్షలు చేసి రక్తహీనత గల విద్యార్థులకు ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఓ నూకరాజు, హెచ్‌వి సన్యాసమ్మ, హెచ్ఎస్ రామాకాంతరావు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ వితరణ

ప్రజాశక్తి -కొత్తకోట:ఫోర్ జి ఆర్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని జెడ్ కొత్త పట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం కృష్ణ కుమారి కొనియాడారు. శుక్రవారం చోడవరంకు చెందిన ఫోర్ జి ఆర్ ట్రస్ట్ సభ్యులు ఆధ్వర్యంలో పాఠశాలకు చెందిన సుమారు 35 మంది పదవ తరగతి విద్యార్థులకు రూ 10 వేల విలువైన స్టడీ మెటీరియల్ (డి సి ఇ బి మెటీరియల్) ను అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ఫోర్ జి ఆర్ ట్రస్ట్ సభ్యులు గతంలో కూడా రావికమతం మండలంలో భవితా కేంద్రం దివ్యాంగ విద్యార్థులతో పాటు మేడివాడ జిల్లా ఉన్నత పాఠశాల విద్యార్థులకు కూడా ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేయడంతో పాటు బోధనోపకరణ సామాగ్రిని కూడా ఉచితంగా అందించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ చూపుతున్న విద్యార్థులు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి

మాట్లాడుతున్న శిరీషారాణి

ప్రజాశక్తి-కోటవురట్ల: గ్రామీణ ప్రాంతాలలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా పంచాయతీ అధికారి శిరీష రాణి తెలిపారు. శుక్రవారం ఆమె మండలంలో పలు గ్రామాలను ఆకస్మికంగా సందర్శించారు. గ్రామాల్లో నిర్మించిన సంపద దృష్టి కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాలకు వచ్చిన నిధులు సక్రమంగా వినియోగించడంతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిశుభ్రమైన తాగునీరు అందజేయాలని సూచించారు. గ్రామాలకు మంజూరైన అభివృద్ధి నిధులను సక్రమంగా వినియోగించి గ్రామాభ్యుదయానికి సిబ్బంది పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్డి రఘురాం, పలువురు కార్యదర్శులు పాల్గొన్నారు.

దోమల నివారణపై అవగాహన కల్పించండి

ప్రజాశక్తి -సీతమ్మధార : ఇళ్లు, పరిసరాల్లో మురుగునీరు, మంచినీటి నిల్వకు ఆస్కారం లేకుండా చేయడం ద్వారా దోమలు, వాటి లార్వాల వృద్ధిని అరికట్టడంతోపాటు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టవచ్చని డిఎంహెచ్ఒ డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు. శుక్రవారం అల్లిపురం (భీంనగర్), భానోజీనగర్, మురళీనగర్, శివనగర్ యుపిహెచ్‌సిలను సందర్శించి, ఫ్రై డే డ్రై డే కార్యక్రమం పరిశీలించారు. నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని ప్రజలకు, ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పించారు. తర్వాత ఇహెచ్ఆర్, ఇ-ఔషది, ఎన్‌సిడి. 3.0 సర్వేలపై సమీక్షించి తగ సూచనలు చేశారు. ఆర్‌బిఎస్‌కె స్కూల్ విజిట్స్, ఎడబ్ల్యుసి స్క్రీనింగ్‌ను సమీక్షించి, అభ ఐడి మ్యాపింగ్ శతశాతం సాధించాలని ఆదేశించారు. యుపిహెచ్‌సిల పరిధిలో వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండి తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కాగా డిఎంహెచ్ఒ డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆదేశాల మేరకు డిపిఎంఒ డాక్టర్ బి.ఉమావతి, బి.నాగేశ్వరరావు స్వతంత్ర నగర్, వాంబే కోలనీ పట్టణ ఆరోగ్యకేంద్రాలను సందర్శించారు.

మైనింగ్ అనుమతుల రద్దుకు సిపిఎం బైకు ర్యాలీ

ప్రజాశక్తి - ఆనందపురం : పర్యావరణానికి హాని కలిగించే కుసులువాడ కొండ మైనింగ్ తవ్వకాల అనుమతులను రద్దు చేయాలంటూ శుక్రవారం సిపిఎం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ బైకు ర్యాలీని పార్టీ 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు జెండా ఊపి ప్రారంభించారు. చిన్నయ్యపాలెం వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ రేగానిగూడెం, గొల్లలపాలెం, కుసులువాడ గ్రామాల్లో సాగింది. మైనింగ్ అనుమతులు రద్దు చేయాలని ఆందోళనకారులు నినదించారు. శనివారం జరిగే ప్రజాభిప్రాయ సేకరణను వ్యతిరేకించాలన్నారు. బైకు ర్యాలీ ప్రారంభం సందర్భంగా గంగారావు మాట్లాడుతూ మైనింగ్ అనుమతుల కోసం ఆగస్టులో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టగా అందరూ వ్యతిరేకించిన విషయాన్ని గుర్తుచేశారు. అయినప్పటికీ మళ్లీ మాయ మాటలతో మైనింగ్ ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నారని, వీటిని ఐక్యంగా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ భీమిలి డివిజన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్.మూర్తి, నాయకులు నాగరాణి, శినగం శ్రీనివాసరావు, స్థానికులు భీమరాజు, అప్పలరాజు, రవి, నూకరాజు, పైడిరాజు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు